# 5 సాధారణ జీవిత బీమా ఉత్పత్తులు

| అంశాలు | పాఠ్యప్రణాళిక నేర్చుకోవడంలో ఫలితాలు |
|---|---|
| నేర్చుకోవడంలో ఉద్దేశాలు | |
| పరిచయం | |
| కీలక పదాలు | |
| ఎ. భద్రత అవసరాలు | 5.1 |
| బి. జీవిత బీమా  ఉత్పత్తులు (పథకములు) | 5.2 |
| సి. పన్ను విధానం మరియు ద్రవ్యోల్బణం | 5.3 |
| డి. భద్రత అవసరాలలో ప్రాధాన్యతలు | 5.4 మరియు 5.5 |
| కీలకాంశాలు | |
| ప్రశ్న జవాబులు | |
| స్వీయ పరీక్ష ప్రశ్నలు | |

నేర్చుకోవడంలోని ఉద్దేశాలు

ఈ చాప్టర్ నేర్చుకున్నాక, మీరు ఈ క్రింది విషయాలపై అవగాహన పొందగలరు:

- ఒక వ్యక్తి యొక్క  భద్రత అవసరాలను గుర్తించడం;
- భద్రత అవసరాలపై ప్రభావం చూపే వ్యక్తిగత కారణాలను వివరించగలడం;
- జీవిత బీమా పథకంలోని మౌలిక అంశాలను వర్ణించడం;

- బీమా పరిశ్రమ అందించే బీమా పథకముల( ఉత్పత్తుల)ను వివరించగలగడం;
- వివిధ రకాల జీవిత బీమా పథకాలను వివరించడం;
- జీవిత బీమా పథకములపై పడే పన్ను యొక్క ప్రభావాలను వర్ణించగలగడం;
- జీవిత బీమా పథకములపై ద్రవ్యోల్బణం యొక్క ప్రభావం ఎలా ఉంటుందో వివరించగలగడం;
- క్లయింట్ అవసరాలను ప్రాధాన్యక్రమంలో గుర్తించి ఆ అవసరాలను తీర్చేలా జీవిత బీమా పథకములకు దరఖాస్తు చేయించగలగడం.

**పరిచయం**

మనం చాప్టర్ 1లో చూసినట్లుగా, వ్యక్తులను మరియు/లేదా వారిపై ఆధారపడిన వారిని ఆర్థికంగా దెబ్బతీసేటటువంటి ఊహించని పరిణామాలు చోటుచేసుకున్నప్పుడు భద్రత అవసరాలు ఏర్పడతాయి. ఇటువంటి ఊహించని పరిణామాల వల్ల జరిగిన ఆర్థిక నష్టాన్ని వీలైనంతగా భర్తీ చేయగల బీమా ద్వారా భద్రత లభిస్తుందని మనం చూశాం.

బీమా భద్రత ద్వారా లబ్ధి పొందగలమని ఒకవేళ ఎవరికైనా తెలిసినా వారి వ్యక్తిగత భద్రత అవసరాలు మరియు ప్రాధాన్యతలపై వాస్తవిక అవగాహన ఉండదు.

ఇటువంటి వారు బీమా విషయంలో సరైన నిర్ణయం తీసుకునేలా ఏజెంట్లు తగిన పాత్ర పోషిస్తారు.

మార్కెట్‌లో అందుబాటులో ఉన్న వివిధ జీవిత బీమా పథకాల లక్షణాలు, అవసరాలను ఈ చాప్టర్‌లో మనం నేర్చుకుందాం. ముఖ్యంగా ఎటువంటి లక్షణాలు క్లయింట్‌కు సరిపోతాయనే విషయాన్ని తెలుసుకుందాం. చాప్టర్లు 6 మరియు 7లో మనం మన దృష్టిని వ్యక్తుల పొదుపు అవసరాలపై మళ్లిద్దాం. అలాగే ఆ అవసరాలను తీర్చగల పొదుపు సేవల శ్రేణి గురించి తెలుసుకోవడంతోపాటు ఏజెంట్లు అర్థంచేసుకోవాల్సిన ఆరోగ్య బీమా వంటి ఇతర ఆర్థిక సేవల గురించి తెలుసుకుందాం. వీటిని మీరు నేర్చుకోవడం వల్ల మీ క్లయింట్స్ యొక్క వ్యక్తిగత అవసరాలు మరియు పరిస్థితుల దృష్ట్యా తీసుకోవాల్సిన సరైన బీమా గురించి తెలియజేసేందుకు ఇది దోహదపడుతుంది.

**కీలక పదాలు**

ఈ చాప్టర్‌లో కింది పదాలు మరియు భావనలకు ఇక్కడ వివరణలు ఇవ్వడం జరిగింది.

| **భద్రత అవసరాలు** | **భద్రత అవసరాలపై ప్రభావం చూపే కారణాలు** | **మరణం నుండి రక్షణ** | **జీవించి ఉండటంవల్ల పొందే లబ్ధి** |
|---|---|---|---|
| **టర్మ్ బీమా పథకం** | ప్యూర్ ఎండోమెంట్ పథకం | ఎండోమెంట్ బీమా పథకం | పూర్తి జీవిత కాలపు బీమా పథకం |
| **మార్చుకునేందుకు వీలయ్యే బీమా పథకం** | ఏక జీవిత బీమా పథకం | ఉమ్మడి జీవిత బీమా పథకం | సమూహ బీమా పథకం |
| **సూక్ష్మ బీమా పథకం** | యులిప్‌లు | లాభరహిత పాలసీలు | పన్ను విధానం |
| **ద్రవ్యోల్బణం** | అవసరాలను ప్రాధాన్యక్రమంలో గుర్తించడం | పిల్లల పథకం నగదు | వాపసు పథకం(మనీబ్యాక్) |

a **భద్రత అవసరాలు**

జీవిత బీమా ఏజెంటుగా... ఓ వ్యక్తి మరణం లేదా అంగవైకల్యం వల్ల ఏర్పడే భద్రత అవసరాలను మీరు ఆలోచించగలగాలి. ఈ అంశం గురించి చర్చించే ముందు ఈ కింది ఉదాహరణ (కేస్ స్టడీ)ను పరిశీలించేందుకు కొంత సమయాన్ని వెచ్చిద్దాం:

ఉదాహరణ (కేస్ స్టడీ): ఊహించని మలుపు తిరిగిన ప్రశాంత్ జీవితం

స్టేజీ 1

ప్రశాంత్ ఉద్యోగంలో చక్కగా స్థిరపడిన ఒక 35 ఏళ్ల వ్యక్తి. ఆయన భార్య ఓ గృహిణి, వారికి ఏడేళ్ల బాలుడు నిషాంత్ ఉన్నాడు. నిషాంత్‌ను డాక్టర్ చేయాలని ప్రశాంత్ భావించేవాడు. ఇందుకోసం అతని వైద్య విద్య కోసం గత రెండేళ్ల నుంచి ప్రతి నెలా రూ. ఐదు వేలను మ్యూచువల్‌ఫండ్‌లో పెట్టుబడి పెడుతున్నాడు. ప్రశాంత్ తల్లిదండ్రులు రిటైరై, అతనిపై

ఆధారపడి జీవిస్తున్నారు. ప్రశాంత్ రూ. రెండు లక్షల విలువజేసే ఎండోమెంట్ పాలసీని పదేళ్ల కాలవ్యవధికి తీసుకొని ఏటా రూ. 20 వేల ప్రీమియం చెల్లిస్తున్నాడు. ఆదాయపుపన్ను ప్రయోజనాల దృష్ట్యా అతను ఈ పాలసీ తీసుకున్నాడు. ప్రశాంత్ గత ఏడాదే కొత్త ఇంట్లోకి మారాడు. అంతకుముందు అతను కుటుంబంతో కలిసి అద్దె ఇంట్లో ఉండేవాడు. ప్రస్తుతం అతను రూ. 40 లక్షల గృహరుణంతోపాటు రూ. ఏడు లక్షల కారు లోన్‌ను వాయిదాల్లో చెల్లిస్తున్నాడు. క్రెడిట్‌కార్డు ఉపయోగిస్తూ ఏటా కుటుంబంతో కలిసి విహారయాత్రలకు కూడా వెళ్తున్నాడు. దినదినప్రవర్ధమానమవుతున్న భారతదేశ మధ్యతరగతి కుటుంబాలకు అతను చక్కటి ఉదాహరణగా నిలుస్తున్నాడు. జీవితంలో అతను కోరుకుంటున్నవన్నీ కోరుకుంటున్నట్లుగానే జరిగిపోతున్నాయి.

స్టేజీ 2

ప్రశాంత్ ఎంతో ఆనందంగా జీవితాన్ని గడుపుతున్న క్రమంలో అతని తలరాత మరోలా మారింది: అతని జీవితం ఊహించని విషాదమైన మలుపు తిరిగింది. నిషాంత్ తన 8వ పుట్టినరోజుకు బహుమతిగా తండ్రి నుంచి అందుకోనున్న కొత్త సైకిల్ కోసం ఆతృతగా ఎదురుచూస్తున్నాడు. ముంబైలో అధికారిక కాన్ఫరెన్స్ లో పాల్గొని ఇంటికి తిరిగి రావాల్సిన తండ్రి తిరిగిరాని లోకాలకు వెళ్లిపోతాడని అతనికి ఏం తెలుసు. ప్రశాంత్ ఇంటికి తిరిగి వస్తున్న వేళ అతను ప్రయాణిస్తున్న విమానం కుప్పకూలి మరణిస్తాడు. నిషాంత్ తండ్రి లేదా అతను కొనితెస్తానన్న సైకిల్ ఎప్పటికీ ఇంటికి చేరలేదు. ప్రశాంత్ మరణించాడన్న పిడుగులాంటి వార్త ఆ కుటుంబానికి అశనిపాతంలా మారింది.

స్టేజీ 3

ప్రశాంత్ మరణం మాత్రమే ఆ కుటుంబానికి చేదువార్త కాలేదు. మరిన్ని దుర్వార్తలు ఆ కుటుంబం వినాల్సి వచ్చింది. ప్రశాంత్ మరణించాడన్న దు:ఖం నుంచి ఇంకా పూర్తిగా బయటపడకముందే అప్పుల వాళ్లు ఇంటి ముందు క్యూ కట్టడం మొదలుపెట్టారు. మొదట క్రెడిట్ కార్డు రికవరీ ఏజెంట్లు, ఆపై కార్ లోన్ రికవరీ ఏజెంట్లు వచ్చారు. కారు ఈఎంఐలు కట్టనందుకు వాహనాన్ని తీసుకెళ్లిపోయారు. చివరగా బ్యాంకు రూపంలో ఆ కుటుంబానికి మరో దెబ్బ తగిలింది. గృహరుణం యొక్క ఈఎంఐలు చెల్లించలేకపోవడంతో ఇల్లు ఖాళీ చేయాల్సిందిగా బ్యాంకు ఆదేశించింది.

నిషాంత్ చదువు కోసం పెట్టుబడిపెట్టే వారు లేకపోవడంతో అతని చదువుపై ఏర్పరుచుకున్న కలలు అడియాశలుగా మిగిలిపోయాయి. కుటుంబంలో కేవలం ప్రశాంత్ మాత్రమే ఆర్జించే వ్యక్తి కావడంతో అతని కుటుంబ జీవనమే ప్రశ్నార్థకంగా మారింది.

ప్రశాంత్ తీసుకున్న రూ. 2,00,000 ఎండోమెంట్ పాలసీ అతని కుటుంబ అవసరాలను కనీసం ఏడాది వరకూ కూడా తీర్చలేకపోయింది. ప్రశాంత్ తన జీవితంలో తీసుకున్న ఏకైక బీమా మొత్తం ఇదే, అది కూడా ఆదాయపుపన్ను ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని తీసుకున్నాడు.

ప్రస్తుతానికి ఈ ఉదాహరణ(కేస్ స్టడీ)ను గుర్తుంచుకొని మనం ఈ చాప్టర్‌లోని ఇతర అంశాలను తెలుసుకుందాం. ఉదాహరణ (కేస్ స్టడీ) గురించి మనం సెక్షన్ డిలో చర్చించుకుందాం. ప్రశాంత్, అతని కుటుంబానికి ఎలాంటి భిన్న పరిస్థితులు ఎదురయ్యేవో తెలుసుకుందాం.

**ఏ1 వ్యక్తి యొక్క సాధారణ భద్రత అవసరాలు**

బీమా రూపంలో ఒక వ్యక్తికి ఆర్థిక భద్రత అవసరం అయ్యేందుకు కారణాలు చాలా ఉన్నాయి. ఆ అవసరాలు ఇలా ఉన్నాయి:

**ఏ1ఎ ఆదాయం**

ఒక వ్యక్తి ప్రస్తుతం తాను సంపాదించే ఆదాయాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అలాగే భవిష్యత్తులో కూడా ఆర్జించగలనని అంచనా వేయగలగాలి. ఆదాయంపై భద్రత లేని ఒక వ్యక్తి యొక్క అకాల మరణం కుటుంబాన్ని ఎలా ఆర్థిక ఇబ్బందులకు గురిచేస్తుందో ఇందాక మనం పైన చూసిన ఉదాహరణ ద్వారా తెలుసుకున్నాం. అందువల్ల భవిష్యత్తులో జరిగే ఆదాయ నష్టం నుంచి బీమా అనే పదం మనకు భద్రత కల్పించగలదు.

**ఏ1బి వైద్య అవసరాలు**

మనం ఏమాత్రం ఊహించని పరిస్థితుల్లోనే అత్యవర వైద్య పరిస్థితులు తలెత్తుతాయి. మనం పైన చూసిన ఉదాహరణలో ప్రశాంత్ తల్లిదండ్రులు రిటైరై అతనిపై ఆధారపడి జీవిస్తున్నారు. వృద్ధాప్యంలో అనారోగ్యం పట్టి పీడిస్తే కుటుంబ భారాన్ని మోసే వ్యక్తికి వైద్య ఖర్చులు అదనపు భారమవుతాయి. ఊహించని అత్యవసర వైద్య అవసరాల నుంచి ఆరోగ్య బీమా భద్రత కల్పించగలదు.

**ఏ1సి ఆధారపడినవారు**

పిల్లల చదువు: ఈ రోజుల్లో చాలా మంది పిల్లలు ఒకేరకమైన ఎంబీఏ, ఇంజనీరింగ్, మెడికల్ కోర్సులను కోరుకుంటున్నారు. అయితే నాణ్యమైన విద్యను అందించే మంచి సంస్థలు పరిమితంగా ఉండటంతో విద్యాభ్యాసం ఖర్చు భారీగా పెరుగుతోంది. ఫలితంగా, పిల్లల చదువు విషయంలో తల్లిదండ్రులు ముందుస్తు ప్రణాళిక వేసుకోవడం

అవసరమైంది. పైన చెప్పుకున్న ఉదాహరణలో ఓ తండ్రి అకాల మరణం అతని కుమారుడి చదువు యొక్క ప్రణాళికను ఏ విధంగా దెబ్బతీస్తుందో మనం చూశాం. అందువల్ల, పిల్లల విద్యా నిధిని కాపాడుకోవాల్సిన అవసరం ఉంది. తల్లిదండ్రుల్లో ఒకరు లేని పరిస్థితుల్లో పిల్లల బీమా పథకం (దీని గురించి మనం తదుపరి చాప్టర్‌లో మరింత వివరంగా నేర్చుకుందాం) ఈ సమస్యను అధిగమించడంలో దోహదపడుతుంది.

పిల్లల పెళ్లి: పిల్లల అవసరాలను అత్యుత్తమ మార్గంలో తీర్చేందుకు తల్లిదండ్రులు అవసరమైనవి అన్నింటినీ సమకూర్చుతారు. తమ ఏకైక కుమార్తె పెళ్లి పట్టణంలోకెల్లా ఘనంగా జరగాలని మరియు పెళ్లికి హాజరయ్యే అతిథులంతా దీని గురించే చర్చించుకోవాలని కలలుకంటారు. ఈ కలను సాకారం చేసుకునేందుకు కూతురు పుట్టినప్పటి నుంచే ఆమె పెళ్లి కోసం డబ్బును పెట్టుబడి రూపంలో జమచేస్తుంటారు. అయితే తల్లిదండ్రుల్లో ఒకరి అకాల మరణం ఈ కలను సాకారం కానివ్వకుండా అడ్డుపడుతుంది. అందువల్ల దీనికి భద్రత కల్పించాల్సిన అవసరం ఉంది. ఇటువంటి పరిస్థితుల్లో పిల్లల బీమా పథకం  భద్రత కల్పించగలదు.

### ఏ1డి ఆస్తులు మరియు అప్పులు

ఇల్లు, కారు లేదా వ్యాపారం వంటి ఆస్తులు మనకు ఎంతో ప్రధానమైనవి. ఈ ఆస్తులను సమకూర్చుకునే క్రమంలో- భారీ ప్రారంభ పెట్టుబడుల వల్ల అందుకు అవసరమయ్యే రుణాల కోసం మనం దరఖాస్తు చేసుకోవాల్సి వస్తుంది. అయితే ఈ రుణాలను సకాలంలో చెల్లించేలా చూసుకోవడం కుటుంబంలో ఆదాయం ఆర్జించే వ్యక్తి  యొక్క బాధ్యత. ఒకవేళ ఆదాయం ఆర్జించే వ్యక్తి హఠాత్తుగా మరణిస్తే ఈ రుణాల చెల్లింపు బాధ్యతను ఎవరు తీసుకుంటారు? ఇందాక పైన చూసిన ఉదాహరణలో ప్రశాంత్ మరణం వల్ల అతని కుటుంబం కారు మరియు గృహరుణంపై ఈఎంఐలు చెల్లించలేక వాటిని కోల్పోవడాన్ని మనం చూశాం. అందువల్ల కుటుంబానికి ఆదాయం ఆర్జించే వ్యక్తి దూరమైతే ఈ ఆస్తుల(రుణాలు)ను కాపాడుకోవాల్సిన అవసరం ఉంది. ఈ ఉదాహరణలో గృహ బీమా లేదా అదనపు టర్మ్ బీమా ద్వారా భద్రత పొందవచ్చు. కుటుంబంలో ఆదాయం ఆర్జించే వ్యక్తి ఒకవేళ హఠాత్తుగా మరణిస్తే క్రెడిట్‌కార్డు బకాయిలు, వ్యక్తిగత రుణాలు, కారుపై రుణం మరియు ఇతర రుణాలపై భద్రతను కల్పించడంలో అదనపు టర్మ్ బీమా దోహదపడుతుంది.

### ఏ1ఈ కుటుంబ నిర్వహణ

ఆదాయం ఆర్జించే వ్యక్తి దూరమయ్యే కుటుంబాన్ని ఆదుకోవాల్సిన అవసరం ఉంది. పై ఉదాహరణలో మనం చూసినట్లుగా ప్రశాంత్ మరణంతో అతని కుటుంబ జీవనం ప్రశ్నార్థకంగా మారింది. కుటుంబంలో సంపాదించే వ్యక్తి ఒకరు

మాత్రమే ఉంటే అప్పుడు బీమా చేసిన వ్యక్తి తన అకాల మరణం తర్వాత కుటుంబ అవసరాలను తీర్చేందుకు తగిన జీవిత బీమా ఉందో లేదో చూసుకోవాలి. ఇక్కడ టర్మ్ బీమా పథకం ఆ కుటుంబానికి భారీ మొత్తంలో నగదు అందిస్తుంది. లేదా పెన్షన్ పథకం క్రమంతప్పకుండా ఆదాయం అందిస్తుంది.

**జాగ్రత్త సుమా**

సరైన ఆర్థిక ప్రణాళిక ద్వారా పైన చెప్పుకున్న అన్ని రకాల అవసరాలకు భద్రత లభిస్తుంది. సరైన ఆర్థిక ప్రణాళిక మూడు రకాల ప్రయోజనాలు కల్పిస్తుంది. భద్రత, పెట్టుబడులపై రిటర్నులు మరియు పన్ను ప్రయోజనాలు


**దీన్ని పరిశీలించండి...**

ప్రస్తుతం మీరు ఓ వ్యక్తి సాధారణ భద్రత అవసరాల గురించి తెలుసుకున్నారు కాబట్టి, మీ వ్యక్తిగత భద్రత అవసరాల జాబితాను తయారు చేసుకోండి. పైన పేర్కొన్నవి కాకుండా మీకు ఇంకేమైనా ఇతర భద్రత అవసరాలు ఉన్నాయా?

**ఏ2 భద్రత అవసరాలపై ప్రభావం చూపే వ్యక్తిగత కారణాలు**

క్లయింట్‌కు ఉన్న ఖచ్చితమైన భద్రత అవసరాలు ఈ క్రింద చెప్పుకునే వ్యక్తిగత మరియు ఆర్థిక వివరాల ద్వారా ప్రభావితమై ఉంటాయి:

5.1



## ఎ2ఎ వయస్సు

ఒక వ్యక్తి యొక్క అవసరాలపై అతని వయస్సు వివిధ రకాలుగా ప్రభావం చూపుతుంది. ఒక వ్యక్తి తన 20వ వయస్సులో సంపాదన మొదలుపెడితే అతను స్వీయరక్షణతోపాటు ఆదాయ భద్రత గురించి అధికంగా ఆలోచిస్తాడు. జీవితం ముందుకు సాగే క్రమంలో పెళ్లి కావడంతో అతని బాధ్యత మరింత పెరుగుతుంది. దీంతో అతను ఇల్లు, రిటైరయ్యాక కావలసిన నిధి వంటి ఆస్తులను సంపాదించుకున్నాక తల్లిదండ్రుల సంరక్షణ గురించి ఆలోచించడం మొదలుపెట్టాల్సిన అవసరం ఏర్పడుతుంది. వయస్సు కూడా వ్యక్తులు ఆరోగ్య భద్రత పొందడంలో ప్రభావం చూపుతుంది. 30-35 ఏళ్ల వయస్సులోని వ్యక్తి చెల్లించే బీమా ప్రీమియం కంటే 20-25 ఏళ్ల మధ్య ఉండే వ్యక్తి చెల్లించే బీమా ప్రీమియం తక్కువ. అందువల్ల బీమా భద్రతను వీలైనంత త్వరగా పొందడం ఉత్తమం.

## ఏ2బి ఆధారపడినవారు

ఒక వ్యక్తి వివాహం చేసుకున్నాక, అతను విస్తరించిన తన కుటుంబాన్ని అనగా భార్య/భర్త, పిల్లల అవసరాలను తీర్చే బాధ్యత తీసుకోవాల్సి వస్తుంది. ఆ తర్వాతి దశలో ఆ వ్యక్తి యొక్క తల్లిదండ్రులు కూడా రిటైరై, వారు కూడా అతనిపై ఆధారపడొచ్చు. ఫలితంగా ఆ వ్యక్తిపై ఆధారపడిన వారి సంఖ్య పెరుగుతుంది. అందువల్ల ఆధారపడినవారు ఎక్కువగా ఉంటే అధిక బీమా మొత్తం ఉండాల్సిన అవసరం ఉంది.

## ఏ2సి ఆదాయం

పిల్లల చదువు, వారి పెళ్లిళ్లు, ఇంటి కొనుగోలు వంటి ఆర్థిక బాధ్యతలను నెరవేర్చడంలో ఓ వ్యక్తి సంపాదన కీలక పాత్ర పోషిస్తుంది. ఓ వ్యక్తి సంపాదన ప్రారంభించినప్పుడు అతని ఆదాయం సాధారణంగా తక్కువ ఉంటుంది. ఆ దశలో అతని ఆదాయం ఇంటి కొనుగోలు, కారు కొనుగోలు వంటి అవసరాలను తీర్చలేదు. రుణాలు ఈ ఆదాయ వ్యత్యాసాన్ని తీరుస్తాయి. ఒకవేళ ఆదాయం సంపాదించే వ్యక్తికి ఏదైనా జరిగితే ఈ రుణాలపై బీమా భద్రత ఎంతో ప్రధానం. పిల్లల చదువు, పెళ్లిళ్లు మరియు సొంత రిటైర్‌మెంట్ వంటి బాధ్యతలను తీర్చుకునేందుకు ఆ వ్యక్తి చిన్న చిన్న మొత్తాలలో పెట్టుబడులు పెట్టడం ప్రారంభించి ఆదాయం పెరిగేకొద్దీ వాటిని పెంచుకోవాలి.

## ఎ2డి ఆస్తులు మరియు అప్పులు

ఒక వ్యక్తి భద్రత అవసరాలపై ఆస్తులు మరియు అప్పుల ప్రభావం తగిన రీతిలో ఉంటుంది. ఇళ్ల వంటి ఆస్తుల కొనుగోలులో రుణాల ద్వారానే ప్రధానంగా ఆర్థిక మొత్తం సమకూరుతుంది. కుటుంబంలో సంపాదించే వ్యక్తి దీర్ఘకాలిక అంగవైకల్యానికి గురైనా లేదా హఠాత్తుగా మరణించినా ఆదాయ భద్రత, రుణాల చెల్లింపు సక్రమంగా జరిగేలా

దోహదపడుతుంది. ఆదాయం ఆర్జించే వ్యక్తి మరణించినప్పుడు కారు కొనుగోలు, విహారయాత్రలకు వెళ్లేందుకు తీసుకున్న రుణాల వంటి అప్పులు కుటుంబంపై ఆర్థికభారం మోపుతాయి. ఈ రుణాలను తీర్చేందుకు కుటుంబం తప్పనిసరిగా ఆస్తులను విక్రయించడమో లేదా పెట్టుబడులను ఉపసంహరించుకోవడమో చేయాల్సి వస్తుంది. ఇది కుటుంబ ప్రయోజనాలకు విఘాతం కలిగిస్తుంది.

**బి. జీవిత బీమా పథకములు( ఉత్పత్తులు)**

**బి1. జీవిత బీమా పథకములలోని మౌలిక అంశాలు**

చిన్న వయస్సులోనే మరణించడం మొదలుకొని దీర్ఘకాలంపాటు జీవించడం వరకూ రిస్క్ ఆధారంగా జీవిత బీమా కంపెనీలు వివిధ రకాల పథకాలను అందిస్తున్నాయి. భారతదేశంలోని బీమా కంపెనీలు అందించే చాలా బీమా పథకాల్లో రెండు మౌలిక అంశాలు ఉన్నాయి:

డెత్ కవర్- బీమా చేసిన వ్యక్తికి పాలసీ కాలవ్యవధిలోగా మరణం సంభవిస్తే నామినీ/లబ్ధిదారునికి బీమా కంపెనీ ఈ మొత్తం చెల్లిస్తుంది.

మెట్యూరిటీ బెనిఫిట్ పాలసీ కాలవ్యవధి ముగిశాక కూడా బీమా చేసిన వ్యక్తి జీవించి ఉంటే బీమా కంపెనీ ఈ మొత్తాన్ని ఆ వ్యక్తికి చెల్లిస్తుంది. మనీబ్యాక్ వంటి కొన్ని పాలసీలు బీమా చేసిన వ్యక్తికి కాలవ్యవధి ముగిసేలోగా క్రమం తప్పకుండా చెల్లింపులు చేస్తుంటాయి. వీటిని సర్వైవల్ బెనిఫిట్స్ అంటారు. మనీబ్యాక్ పాలసీల గురించి ఈ చాప్టర్‌లోని బి2ఎం సెక్షన్‌లో వివరంగా తెలుసుకుందాం.

**జాగ్రత్త సుమా**

బీమా పాలసీలను సాధారణంగా ఒక వ్యక్తి జీవితంపై జారీ చేస్తుంటారు. ఇందులో ఒక వ్యక్తి జీవితానికి మాత్రమే బీమా లభిస్తుంది. ఒక్కరికన్నా ఎక్కువ జీవితాలకు బీమా కల్పించే పాలసీల గురించి మనం బి2జి మరియు బి2ఐ సెక్షన్లలో తెలుసుకుందాం.

**బి2 సాధారణ జీవిత బీమా  ఉత్పత్తులు(పథకములు)**

బీమా పరిశ్రమ అందించే ప్రధాన జీవిత బీమా పథకాల గురించి ఈ క్రింద చర్చిద్దాం.

బి2ఎ టర్మ్ బీమా పథకం

జీవిత బీమా పరిశ్రమ అందించే అత్యంత సాధారణమైన మరియు సులభమైన బీమా పథకం ఇది. ఈ పథకంలో బీమా చేసిన వ్యక్తి  ఈ పథకం యొక్క టర్మ్ (కాలవ్యవధి) ముగిసేలోగా మరణిస్తే జీవిత బీమా కంపెనీ బీమా సొమ్మును చెల్లిస్తుంది. ఒకవేళ బీమా చేసిన వ్యక్తి  గడువులోగా మరణించకపోతే ఎటువంటి లబ్ధి ఉండదు. అంటే ఇలాంటి పథకాల్లో గడువు తీరాక ఎటువంటి ఆర్థిక ప్రయోజనం లభించదు. స్థూలంగా చెప్పాలంటే ఈ పథకం కాలవ్యవధి పూర్తయ్యేలోగా బీమా చేసిన వ్యక్తి మరణిస్తే డెత్ కవర్‌ను మాత్రమే అందిస్తుంది.

**ఉదాహరణ**

ఏబీసీ అనే బీమా కంపెనీ నుండి ప్రశాంత్ 30 ఏళ్ల కాలవ్యవధికి రూ. 75 లక్షలకు టర్మ్ బీమా పథకం తీసుకున్నాడు. ఈ పథకం డాక్యుమెంట్ ఏం చెబుతోందంటే 30 ఏళ్ల పాలసీ గడువులోగా ప్రశాంత్ మరణిస్తే, బీమా కంపెనీ ప్రశాంత్ తరఫు నామినీకి రూ. 75 లక్షలు చెల్లిస్తుంది. అయితే ఒకవేళ పాలసీ గడువు వరకూ ప్రశాంత్ జీవిస్తే అతనికి ఎటువంటి మెట్యూరిటీ లేదా సర్వైవల్ బెనిఫిట్ లభించదు.

**కీలకాంశాలు:**

టర్మ్ బీమా పథకాలు డెత్ కవర్ మాత్రమే అందిస్తాయి.

బీమా కంపెనీలు అందించే పథకాల్లో ఇవే అత్యంత సులభమైనవి.

మార్కెట్‌లో లభించే బీమా పథకాల్లో టర్మ్ బీమా పథకాలే అత్యంత చౌక అయినవి. తక్కువ ప్రీమియంతో కూడా ఓ వ్యక్తి తన అప్పులన్నీ తీరేలా భారీ ఆర్థిక భద్రత పొందవచ్చు.

కాలవ్యవధి: ఈ పేరు సూచిస్తున్నట్లుగానే ఈ పథకాలు నిర్ణీత కాలవ్యవధి వరకూ మాత్రమే భద్రతను అందిస్తాయి. సాధారణంగా ఈ పథకాలు 5, 10, 15, 20, 25, 30 ఏళ్ల వరకూ ఉంటాయి. లేదా బీమా చేసిన వ్యక్తి ఎంపిక చేసుకుని/అందుకు బీమా కంపెనీ అంగీకరించే కాలవ్యవధి వరకూ ఉంటాయి.

అప్పులపై భద్రత: గృహ రుణాలు లేదా కారు రుణాలు వంటి భారీ అప్పులకు భద్రత కావాలంటే బీమా అనే పదమే ఉత్తమ సమాధానం.

కొన్ని టర్మ్ పథకాల క్రింద బీమా కంపెనీలు బీమా చేసిన వ్యక్తి తన మరణంపై చేసే బీమాను కాలవ్యవధిలోగా పెంచేందుకు లేదా తగ్గించేందుకు అంగీకరిస్తాయి.

కనిష్ట మరియు గరిష్ట బీమా మొత్తం: బీమా కంపెనీ చాలా టర్మ్ పథకాలకు కనిష్ట మరియు గరిష్ట బీమా మొత్తాలను ప్రత్యేకంగా తెలియజేస్తుంది. కొన్ని బీమా కంపెనీల్లో గరిష్ట బీమా మొత్తం అండర్‌రైటింగ్ ప్రాతిపదికగా ఉంటుంది.

కనిష్ట మరియు గరిష్ట వయసు: టర్మ్ పథకాలను తీసుకునేందుకు, వాటి నుంచి వైదొలగేందుకు ఉండాల్సిన వయస్సును కూడా  చాలా బీమా కంపెనీలు ప్రత్యేకంగా తెలియజేస్తాయి.

**బీ2బీ రిటర్న్ ఆఫ్ ప్రీమియం (ఆర్ఓపీ) పథకం**

టర్మ్ బీమా పథకాల్లో వివిధ రకాల పథకాలను రిటర్న్ ఆఫ్ ప్రీమియం రూపంలో కొన్ని బీమా కంపెనీలు అందిస్తాయి. ఒకవేళ బీమా చేసిన వ్యక్తి బీమా కాలవ్యవధిలోగా మరణిస్తే అప్పుడు బీమా కంపెనీ ముందుగా నిర్ణయించిన మొత్తాన్ని (బీమా సొమ్ము) నామినీ/లబ్ధిదారునకు చెల్లిస్తుంది. ఒకవేళ బీమా చేసిన వ్యక్తి పాలసీ కాలవ్యవధి పూర్తయ్యే వరకూ జీవించే ఉంటే అప్పుడు బీమా కంపెనీ పాలసీ గడువు తీరాక ఆ ప్రీమియంలోని కొంత భాగం లేదా మొత్తం ప్రీమియాన్ని నిబంధనల ప్రకారం బీమా చేసిన వ్యక్తికి చెల్లిస్తుంది.

టర్మ్ బీమా పథకంలోని మరో రకం పాలసీలో కాలవ్యవధి పూర్తయ్యే వరకూ బీమా చేసిన వ్యక్తి జీవించి ఉంటే కొన్ని కంపెనీలు ప్రీమియంతోపాటు కొంత వడ్డీని కూడా చెల్లిస్తాయి.

**దీన్ని పరిశీలించండి...**

ఒకవేళ మీరు టర్మ్ బీమా పథకం లేదా 'రిటర్న్ ఆఫ్ ప్రీమియం' పథకంలో ఏదో ఒకటి ఎంపిక చేసుకోవాల్సి వస్తే ఏ పథకం ఎంచుకుంటారు, ఎందుకు?

బీ2సీ పూర్తి ఎండోమెంట్ పథకం

టర్మ్ బీమా పథకానికి వ్యతిరేకమైనదే పూర్తి ఎండోమెంట్ పథకం. ఈ పథకంలో బీమా చేసిన వ్యక్తి పాలసీ కాలవ్యవధి పూర్తయ్యే వరకూ జీవించి ఉంటేనే బీమా కంపెనీ ముందుగా నిర్ణయించిన మొత్తాన్ని (బీమా సొమ్మును) ఇస్తానని హామీ ఇస్తుంది. ఒకవేళ పథకం యొక్క కాలవ్యవధి పూర్తికాకముందే బీమా చేసిన వ్యక్తి మరణిస్తే అప్పుడు బీమా కంపెనీ నుంచి ఎటువంటి సొమ్ము అందదు. స్థూలంగా చెప్పాలంటే, ఈ పథకం కేవలం బీమా చేసిన వ్యక్తి పాలసీ కాలవ్యవధి వరకూ జీవించి ఉంటే మెచ్యూరిటీ బెనిఫిట్‌ను మాత్రమే అందిస్తుంది. ఇందులో డెత్ కవర్ ఉండదు.

**ఉదాహరణ**

ఏబీసీ అనే బీమా కంపెనీ నుంచి ప్రశాంత్ 30 ఏళ్ల కాలవ్యవధికి రూ. 75 లక్షల పూర్తి ఎండోమెంట్ పథకం తీసుకున్నాడు. ఈ పథకం ప్రకారం, ప్రశాంత్ ఒకవేళ ఈ పాలసీ కాలవ్యవధి వరకూ జీవిస్తే పథకం గడువు తీరాక బీమా కంపెనీ ప్రశాంత్‌కు రూ. 75 లక్షలు చెల్లిస్తుంది.

ఒకవేళ ప్రశాంత్ 30 ఏళ్ల కాలవ్యవధిలోగా మరణిస్తే బీమా కంపెనీ నుంచి అతని కుటుంబానికి డెత్ కవర్ అందదు.

జీవితం అనిశ్చితమైనది. అందుకే ప్రశాంత్ వంటి వ్యక్తులు తమకు టర్మ్ బీమా పథకం అవసరమో లేదా పూర్తి ఎండోమెంట్ పథకం అవసరమో తేల్చుకోలేరు. ఎందుకంటే...వారు ఎన్నేళ్లు జీవిస్తారు లేదా ఎప్పుడు మరణిస్తారు అనే విషయం వారికి తెలియదు కాబట్టి.

ప్రశాంత్ ఒకవేళ 30 ఏళ్ల కాలవ్యవధికి టర్మ్ బీమా పథకం తీసుకొని పథకం గడువు ముగిసే వరకూ జీవిస్తే అతనికి బీమా కంపెనీ నుంచి ఏమీ లభించదు. అలాగే ఒకవేళ అతను 30 ఏళ్ల కాలవ్యవధికి పూర్తి ఎండోమెంట్ పథకం తీసుకొని దురదృష్టవశాత్తూ పథకం గడువులోగా మరణిస్తే అతని తరఫు నామినీ/లబ్ధిదారునకు ఎటువంటి సొమ్ము అందదు.

పైన చెప్పుకున్న ఇలాంటి పరిస్థితులు ప్రజలను ఎటువంటి బీమా పథకం తీసుకోవాలో తెలియజేయక గందరగోళానికి గురిచేస్తుంటాయి. ఇలాంటి పరిస్థితిని చక్కదిద్దేందుకు జీవిత బీమా కంపెనీలు పైన చెప్పుకున్న రెండు పథకాల లక్షణాలను కలిపి ఎండోమెంట్ బీమా పథకం పేరుతో అందిస్తున్నాయి.

**బీ2డీ ఎండోమెంట్ బీమా పథకం**

ఎండోమెంట్ బీమా పథకం ప్రాథమికంగా టర్మ్ బీమా పథకం మరియు పూర్తి ఎండోమెంట్ పథకముల కలబోతగా ఉంటుంది. బీమా చేసిన వ్యక్తి ఒకవేళ పథకం కాలవ్యవధిలోగా మరణిస్తే డెత్ కవర్‌ను అందిస్తుంది లేదా పథకం కాలవ్యవధి తీరాక కూడా ఒకవేళ బీమా చేసిన వ్యక్తి జీవించి ఉంటే సర్వైవల్ బెనిఫిట్ అందిస్తుంది.

**ఉదాహరణ**

ఏబీసీ అనే బీమా కంపెనీ నుంచి ప్రశాంత్ 30 ఏళ్ల కాలవ్యవధికి రూ. 75 లక్షల ఎండోమెంట్ బీమా పథకం తీసుకున్నాడు. ఈ పథకం ప్రకారం ప్రశాంత్ ఒకవేళ 30 ఏళ్ల గడువు వరకూ జీవిస్తే బీమా కంపెనీ అతనికి రూ. 75 లక్షలు చెల్లిస్తుంది. దీనితోపాటు బోనస్ ఏదైనా జమ అయితే దానిని కూడా చెల్లిస్తుంది. ఒకవేళ ప్రశాంత్ పథకం గడువులోగా మరణిస్తే అతని నామినీ/లబ్ధిదారునకు బీమా కంపెనీ రూ. 75 లక్షలు చెల్లించి పథకాన్ని రద్దు చేస్తుంది.

**పైన చెప్పుకున్న పథకం వీటి కలబోత:**

30 ఏళ్ల కాలవ్యవధికి రూ. 75 లక్షలతో కూడిన ఒక టర్మ్ బీమా పథకం

30 ఏళ్ల కాలవ్యవధికి రూ. 75 లక్షలతో కూడిన ఒక పూర్తి ఎండోమెంట్ పథకం

ఒకవేళ ప్రశాంత్ పాలసీ గడువులోగా మరణిస్తే టర్మ్ బీమా పథకం ఆదుకుంటుంది. ఒకవేళ పాలసీ గడువు పూర్తయ్యేక కూడా అతను జీవించి ఉంటే పూర్తి ఎండోమెంట్ పథకం సొమ్ము చెల్లిస్తుంది.

జాగ్రత్త సుమా

భారత దేశంలోని జీవిత బీమా కంపెనీలు అందించే అత్యధిక బీమా పథకాలు టర్మ్ బీమా మరియు పూర్తి ఎండోమెంట్ పథకాల కలబోతవే.

దీన్ని పరిశీలించండి...

ఒకవేళ మీరు టర్మ్ బీమా పథకం లేదా పూర్తి ఎండోమెంట్ పథకంలో ఏదో ఒకటి ఎంపిక చేసుకోవాల్సి వస్తే ఏది ఎంపిక చేసుకుంటారు, ఎందుకు?

కీలకాంశాలు

ఎండోమెంట్ బీమా పథకం తీసుకున్న వ్యక్తి పాలసీ కాలవ్యవధి ముగిసే వరకూ జీవించి ఉంటే నిర్ణీత సొమ్ము అందుతుంది.

డెత్ కవర్:ఈ పథకంలో డెత్ కవర్ అంశం కూడా ఉంటుంది. బీమా చేసిన వ్యక్తి పథకం గడువు తీరేలోగా మరణిస్తే అప్పుడు డెత్ కవర్ ప్రయోజనాన్ని నామినీ/లబ్ధిదారునకు చెల్లిస్తారు.

పొదుపు అంశం: ఈ పథకంలో డెత్ కవర్‌తోపాటు పొదుపు అంశం కూడా ఉంటుంది. ప్రీమియం నుంచి డెత్ కవర్ చార్జీలు మరియు నిర్వహణ (అడ్మినిస్ట్రేషన్) చార్జీలను మినహాయించుకున్నాక మిగిలిన మొత్తాన్ని బీమా కంపెనీ బీమా చేసిన వ్యక్తి పేరిట పెట్టుబడి పెడుతుంది. దీనిపై వచ్చే లాభాలను బోనస్ రూపంలో ఆ తర్వాత చెల్లిస్తుంది.

లక్ష్యం ఆధారిత పట్టుబడి: పిల్లల ఉన్నత చదువు లేదా పెళ్లి వంటి ప్రత్యేక ప్రణాళికల కోసం సొమ్ము కూడబెట్టేందుకు ఈ పథకాన్ని ఎంచుకోవచ్చు.

కొన్ని బీమా కంపెనీలు ఈ పథకాలపై పాక్షిక సొమ్ము ఉపసంహరణ లేదా పథకాలపై రుణ సౌకర్యం కూడా కల్పిస్తాయి.

ఈ పథకం వివిధ రకాలుగా అందుబాటులో ఉంటుంది. కొన్ని పథకాలకు గడువు తీరాక చెల్లించే సొమ్ముకన్నా డెత్ కవర్ అధికంగా ఉంటే మరికొన్నింటికి ఇందుకు వ్యతిరేకంగా ఉంటుంది.

కొన్ని పథకాల్లో డెత్ కవర్‌కు రెట్టింపుగా గడువు ముగిశాక చెల్లించే సొమ్ము(మెచూరిటీ సొమ్ము) ఉంటుంది. ఈ తరహా పథకాన్ని డబుల్ ఎండోమెంట్ బీమా పథకం అంటారు.

ప్రశ్న 5.1

జీవిత బీమా పథకంలోని మౌలిక అంశాలను వివరించండి

పార్టిసిపేటింగ్ మరియు నాన్-పార్టిసిపేటింగ్ పథకాలు

అత్యధిక ఎండోమెంట్ పథకాల్లో ప్రీమియంతోపాటే పొదుపు అంశం కూడా మిళితమై ఉంటుంది. పాలసీదారుల తరఫున బీమా కంపెనీ ఈ సొమ్మును పెట్టుబడి పెట్టి లాభాలు వచ్చాక పాలసీదారులకు బోనస్‌ల రూపంలో తిరిగి చెల్లిస్తుంది.

బీమా కంపెనీ లాభాల్లో పాలసీదారులు పాలుపంచుకునేలా ఉండే ఇటువంటి పథకాలను 'విత్ ప్రాఫిట్స్' (లాభ సహిత) పథకాలు లేదా పార్టిసిపేటింగ్ పథకాలు అంటారు. ఎండోమెంట్, మనీబ్యాక్ మరియు పూర్తి జీవిత పథకాల్లో చాలా వరకూ ఇటువంటివే. మనీబ్యాక్ మరియు పూర్తి జీవిత పథకాల గురించి ఈ సెక్షన్‌లో తర్వాత తెలుసుకుందాం.

బీమా కంపెనీ లాభాల్లో పాలసీదారులు పాలుపంచుకునేందుకు వీలు కల్పించని పథకాలను 'వితౌట్ ప్రాఫిట్స్' (లాభరహిత) పథకాలు లేదా నాన్□పార్టిసిపేటింగ్ పథకాలు అంటారు. పూర్తి టర్మ్ పథకాలు ఈ కోవకు చెందినవే.

**ప్రతిపాదిత కృత్యం**

మీకు ఇంటర్నెట్ సౌకర్యం ఉంటే ఓ ఐదు బీమా కంపెనీల వెబ్‌సైట్లను సందర్శించి ఆ కంపెనీలు అందించే వివిధ ఎండోమెంట్ పథకాల లక్షణాలను అధ్యయనం చేయండి. ఐదు కంపెనీలు అందించే ఎండోమెంట్ పథకాల లక్షణాలను పోలుస్తూ చార్టు రూపొందించండి. మీ దృష్టిలో ఏ కంపెనీ అత్యుత్తమ ఎండోమెంట్ పథకం అందిస్తోందో చెప్పండి?

**బి2ఈ పూర్తి జీవిత కాలపు బీమా పథకాలు**

నిర్ణీత కాలవ్యవధి లేని టర్మ్ బీమా పథకాన్ని పూర్తి జీవిత కాలపు పథకం అంటారు. ఇందులోని కొన్ని పథకాలకు పొదుపు సౌలభ్యం కూడా ఉంటుంది. ఈ పథకాల్లో పెట్టుబడులపై వచ్చే లాభాలపై బీమా కంపెనీ బోనస్‌లు కూడా ప్రకటిస్తుంది.

ఈ పథకం పేరులో ఉన్నట్లుగానే బీమా చేసిన వ్యక్తికి పూర్తి జీవితంలో బీమా సౌలభ్యం లభిస్తుంది.

బీమా చేసిన వ్యక్తి మరణిస్తే, నామినీ/లబ్ధిదారునకు బీమా సొమ్ముతోపాటు ఆ సమయం వరకూ జమ అయిన బోనస్‌లను కూడా బీమా కంపెనీ చెల్లిస్తుంది.

బీమా చేసిన వ్యక్తి తన జీవితకాలంలో అత్యవసరాల దృష్ట్యా పాక్షికంగా బీమా సొమ్మును విత్ డ్రా చేసుకోవచ్చు. అలాగే ఈ పాలసీలపై రుణాలు కూడా పొందవచ్చు.

**ఉదాహరణ**

ఏబీసీ బీమా కంపెనీ 100 ఏళ్ల వరకూ పూర్తి జీవిత బీమా పథకం అందిస్తోంది.

డెత్ కవర్

బీమా చేసిన వ్యక్తి ఒకవేళ పాలసీ కాలవ్యవధిలో మరణిస్తే బీమా సొమ్ముతోపాటు ఆ సమయం వరకూ జమ అయిన బోనస్‌లను కూడా నామినీ/లబ్ధిదారునకు బీమా కంపెనీ చెల్లిస్తుంది.

సర్వైవల్ బెనిఫిట్

ఒకవేళ బీమా చేసిన వ్యక్తి 100 ఏళ్ల వరకూ జీవించి ఉంటే బీమా సొమ్ముతోపాటు ఆ తేదీ వరకూ జమ అయిన బోనస్‌లను కూడా కలిపి బీమా కంపెనీ చెల్లిస్తుంది.

చేయవలసిన పని

ఇప్పటివరకూ మీరు టర్మ్ పథకాలు, ఎండోమెంట్ పథకాలు మరియు పూర్తి జీవిత పథకాల లక్షణాల గురించి నేర్చుకున్నారు. ఏయే పరిస్థితుల్లో  ఒక వ్యక్తి ఈ మూడు పథకాలను ఎంచుకోవాలో జాబితా తయారు చేయండి

**బి2ఎఫ్ మార్పిడి బీమా పథకాలు**

పేరులో ఉన్నట్లే ఈ బీమా పథకాన్ని ఒక రకం నుంచి మరో రకానికి మార్చుకోవచ్చు. ఉదాహరణకు, టర్మ్ బీమా పథకాన్ని ఎండోమెంట్ పథకం లేదా పూర్తి జీవిత కాలపు పథకం లేదా మరే ఇతర పథకం కిందకు అయినా మార్చుకోవచ్చు.

బీమా చేసిన వ్యక్తి మొదటగా భారీ ప్రీమియం చెల్లించలేని పరిస్థితిలో ఉన్నప్పుడు ఈ మార్పిడి పథకం ఉపయోగపడుతుంది. అందువల్ల అలాంటి వారు తక్కువ ప్రీమియం ఉండే టర్మ్ బీమా పథకంతో ప్రారంభించి ఆ తర్వాత అధిక ప్రీమియం ఉండే ఎండోమెంట్ పథకం లేదా పూర్తి జీవిత కాలపు పథకంలోకి తమ పథకాన్ని మార్చుకోవచ్చు. అలాగే పథకం మార్పిడి సమయంలో బీమా చేసిన వ్యక్తి వైద్య పరీక్షలు చేయించుకోవాల్సిన అవసరం ఉండదు.

మార్పిడి పథకాల్లో ఉండే మరో ప్రయోజనం ఏమిటంటే మార్పిడి సమయంలో ఎటువంటి అండర్‌రైటింగ్ నిర్ణయం తీసుకోవాల్సిన పనిలేదు.

**బి2జి ఉమ్మడి జీవిత బీమా పథకాలు**

ఉమ్మడి జీవిత బీమా పథకాలు ఒకే పాలసీ క్రింద ఇద్దరు వ్యక్తులకు బీమా సౌకర్యం కల్పిస్తాయి. ఈ పథకం పెళ్లయిన జంటలకు లేదా వ్యాపారంలోని భాగస్వాములకు ఉత్తమమైనది.

కొన్ని ఉమ్మడి జీవిత బీమా పథకాల్లో మొదటి పాలసీదారుడి మరణం తర్వాత డెత్ కవర్ (బీమా మొత్తం) చెల్లింపునకు అర్హత పొందుతుంది. అలాగే పాలసీ కాలవ్యవధిలోగా రెండో పాలసీదారుడు కూడా మరణిస్తే ఆ రోజుకు జమ అయిన బోనస్‌లతో కలిపి సొమ్మును బీమా కంపెనీ చెల్లిస్తుంది.

ఒకవేళ ఉమ్మడి పాలసీదారులు పాలసీ కాలవ్యవధి వరకూ జీవించి ఉంటే లేదా ఇద్దరిలో ఒకరు జీవించి ఉంటే అప్పుడు పాలసీ సొమ్ముతోపాటు ఆ రోజు వరకూ జమ అయిన బోనస్‌లను బీమా కంపెనీ చెల్లిస్తుంది.

కొన్ని రకాల ఉమ్మడి బీమా పాలసీల్లో నిర్ణీత గడువు వరకూ ప్రీమియం చెల్లించడమో లేదా మొదటి పాలసీదారుడి మరణం తర్వాత ప్రీమియం చెల్లింపు రద్దయ్యే వరకూ కట్టాలి.

ఉమ్మడి జీవిత బీమా పథకాల్లో ఒక్కో పాలసీదారుడి జీవితాన్ని విడివిడిగా అండర్‌రైట్ చేస్తారు.

**దీన్ని పరిశీలించండి...**

మీరు పెళ్లి చేసుకున్నాక మీకు, మీ భార్య/భర్తకు వేర్వేరు బీమా పాలసీలు తీసుకోవాలనుకుంటారా లేదా ఉమ్మడి జీవిత బీమా తీసుకోవాలనుకుంటారా? దీనిపై మీరు నిర్ణయం తీసుకోవడంలో ఏయే అంశాలను మీరు పరిగణనలోకి తీసుకుంటారు?

**బి2హెచ్ యాన్యుటీలు**

నిర్ణీత గడువు వరకూ ఓ వ్యక్తి బీమా కంపెనీకి చెల్లించే వాయిదా ప్రీమియములు లేదా ఒకేసారి భారీగా చెల్లించే కొనుగోలు మొత్తానికి బదులుగా ఆ కంపెనీ ఆ వ్యక్తికి(యాన్యుటెంట్‌కు) క్రమం తప్పకుండా చెల్లించే మొత్తాలను యాన్యుటీ అంటారు.

కొనుగోలు ధర చెల్లింపు దాని ఆధారంగా యాన్యుటీలు రెండు రకాలుగా ఉండొచ్చు. అవి:

తక్షణ యాన్యుటీ

వాయిదా యాన్యుటీ

యాన్యుటీ అనేది జీవిత బీమా పాలసీకి పూర్తి వ్యతిరేకంగా ఉంటుంది. జీవిత బీమా పాలసీలో నష్టభారాన్ని బీమా కంపెనీ మోస్తుంది. కానీ యాన్యుటీలో...బీమా కంపెనీకి కొనుగోలు ధరను చెల్లించాక యాన్యుటెంట్ తాను సమీప భవిష్యత్తులో మరణించబోనని హామీ ఇస్తూ నష్టభారం మోయాల్సి ఉంటుంది.

ఉమ్మడి జీవితం/ చివరకు మిగిలిన వ్యక్తులకు యాన్యుటీ/ జీవిత యాన్యుటీఆపై కొనుగోలు ధర చెల్లింపు/ పెరుగుదలతో కూడిన యాన్యుటీ వంటి వివిధ రకాల యాన్యుటీలను బీమా కంపెనీలు అందిస్తున్నాయి. ఈ అంశాలను మనం చాప్టర్ 7లో వివరంగా చూద్దాం.

**బి2ఐ సమూహ బీమా పథకాలు**

ఉమ్మడి లక్ష్యంతో ఒకే చోటకు చేరిన బృందానికి సమూహ(సామూహిక) బీమా భద్రత కల్పిస్తుంది.

బృందంలోని వ్యక్తులు ఈ విధంగా ఉండవచ్చు:

సంస్థ ఉద్యోగులు

బ్యాంకు ఖాతాదారులు

కార్మిక సంఘం సభ్యులు

అకౌంటెంట్ల అసోసియేషన్ వంటి వృత్తి సంస్థల సభ్యులు లేదా

ఉమ్మడి లక్ష్యం లేదా ఒకే పని చేసేందుకు ఏకమయ్యే ఏ బృందం అయినా కావచ్చు

సమూహ/సామూహిక బీమా పథకంలో బీమా కంపెనీ బృందంలోని సభ్యులందరినీ కలిపేలా ఒక మాస్టర్ పాలసీ జారీ చేస్తుంది. ఉదాహరణకు, ఓ కంపెనీలోని ఉద్యోగులందరినీ కలుపుతూ యాజమాన్యానికి బీమా కంపెనీ మాస్టర్ పాలసీ జారీ చేస్తుంది. ఉద్యోగుల యాజమాన్యాన్ని 'మాస్టర్ పాలసీ హోల్డర్'గా వ్యవహరిస్తారు.

ఇక్కడ బీమా ఒప్పందం మాస్టర్ పాలసీ హోల్డర్‌కు, బీమా కంపెనీకి మధ్య ఏర్పడుతుంది. ఈ ఒప్పందంలో ఉద్యోగులు ప్రత్యక్ష భాగస్వాములు కారు.

దారిద్య్ర రేఖకు దిగువనున్న కుటుంబాలకు బీమా కల్పించేందుకు ప్రభుత్వం సమూహ/సామూహిక బీమా పథకాలను సామాజిక సంక్షేమ అస్త్రాలుగా ఉపయోగించుకుంటుంది.

2005 జులైలో బీమా పరిశ్రమ నియంత్రణ సంస్థ (ఐఆర్‌డీఏ) సమూహ/సామూహిక బీమా పథకాలపై మార్గదర్శకాలను జారీ చేసింది.

**ఉదాహరణ**

ఎబిసి అనే బీమా కంపెనీ బడుగు వర్గాల కోసం సమూహ/సామూహిక బీమా పథకం అందించేందుకు ముందుకొచ్చింది. ఈ పథకం కింద చేర్చుకునే వ్యక్తులను గుర్తించేందుకు కంపెనీ ఓ ప్రత్యేక అర్హత ప్రమాణాన్ని పాటిస్తోంది.

డెత్ కవర్

బృందంలోని ఒక సభ్యుడు మరణిస్తే, ఆ వ్యక్తిపై బీమా చేసిన రూ. 30 వేలను నామినీ/లబ్ధిదారునకు చెల్లిస్తారు. ఒకవేళ ప్రమాదంలో సభ్యుడి మరణం సంభవిస్తే రూ. 75 వేలను నామినీ/లబ్ధిదారునకు చెల్లిస్తారు.

**బి2జె సూక్ష్మ బీమా పథకాలు**

సూక్ష్మ బీమాపై 2005 నవంబర్‌లో ఐఆర్‌డీఏ మార్గదర్శకాలు జారీ చేసింది. తక్కువ ఆదాయం గల సమూహాలకు బీమా కల్పించాలని సూక్ష్మ బీమా లక్ష్యంగా పెట్టుకుంది.

సూక్ష్మ బీమా పథకాల క్రింద వ్యక్తుల జీవిత బీమా రూ. 5,000 నుంచి రూ. 50,000 మధ్యలో జారీ చేయవచ్చని ఐఆర్‌డిఎ నిర్దేశించింది.

బీమా కంపెనీ, వ్యక్తుల జీవితంపై సూక్ష్మ బీమా సేవలతోపాటు సాధారణ సూక్ష్మ బీమా సేవలను కూడా అందించవచ్చు. (ఇది కేవలం సూక్ష్మ బీమా సేవలకు మాత్రమే వర్తిస్తుంది. ఇతర సాధారణ బీమా రకాల సేవలకు ఇది వర్తించదు.)

బి2కె యూనిట్ ఆధారిత బీమా పథకాలు (యులిప్‌లు)

యూనిట్ ఆధారిత బీమాపథకాలు లాభాలతో కూడిన బీమా పథకాలకన్నా అధిక నష్టభయాన్ని కలిగి ఉంటాయి. వీటిలో కొన్ని హామీలు మాత్రమే ఉంటాయి. అయితే, ఇవి మరింత సరళమైనవి. సరళ రీతిలో పెట్టుబడులు పెట్టి నష్టభయాన్ని మోయడం ద్వారా ప్రయోజనాలు పొందేందుకు సిద్ధంగా ఉండే వ్యక్తులకు ఇవి బాగా సరిపోతాయి. యులిప్‌లలో రాబడి క్యాపిటల్ మార్కెట్లలో

షేర్లు వంటి పెట్టుబడుల ఆధారంగా ఉంటుంది. (షేర్ల గురించి చాప్టర్ 6లో పూర్తిగా తెలుసుకుందాం)

దీన్ని పరిశీలించండి...

మీరు యులిప్ లేదా సంప్రదాయ బీమా పథకం (టర్మ్/ఎండోమెంట్/పూర్తి జీవితం)లో ఏదో ఒకదాన్ని ఎంపిక చేసుకోవాల్సి వస్తే ఏది తీసుకుంటారు? ఈ విషయంలో నిర్ణయం తీసుకునే ముందు మీరు పరిగణనలోకి తీసుకునే అంశాలు ఏమిటి?

కీలకాంశాలు

యూనిట్ ఆధారిత బీమా పథకాలు (యులిప్‌లు) జీవిత బీమాతోపాటు పెట్టుబడులపై ప్రతిఫలాలను కూడా అందిస్తాయి.

సంప్రదాయ పథకాల్లో బీమా చేసిన వ్యక్తి తరఫున ఎందులో పెట్టుబడులు పెట్టాలనే అంశంపై బీమా కంపెనీ నిర్ణయం తీసుకుంటుంది. అయితే యులిప్‌లో బీమా చేసిన వ్యక్తి పెట్టుబడి పెట్టేందుకు ఈక్విటీ నిధులు, రుణ నిధులు, నగదు మార్కెట్ నిధులు వంటి విస్తృత అవకాశాలు ఉంటాయి.

క్యాపిటల్ మార్కెట్ల వృద్ధిలో భాగం పంచుకునేలా యులిప్‌లు బీమా చేసిన వ్యక్తికి అవకాశం కల్పిస్తాయి.

బీమా చేసిన వ్యక్తి మరణిస్తే బీమా మొత్తం లేదా పెట్టుబడిగా పెట్టిన సొమ్ము యొక్క మార్కెట్ విలువ (ఫండ్ విలువ)లలో ఏది ఎక్కువ అయితే బీమా కంపెనీ దానిని చెల్లిస్తుంది.

పథకం గడువు తీరిన తర్వాత ఫండ్ విలువ చెల్లిస్తారు.

సెటిల్‌మెంట్ ఆప్షన్: పథకం గడువు ముగిశాక ఒకేసారి భారీ మొత్తం తీసుకునే బదులు పాలసీదారుడు ఐదేళ్లకు పైబడి వాయిదాలలో బీమా సొమ్మును తీసుకునేందుకు కొన్ని పథకాలు అవకాశం కల్పిస్తాయి. దీన్నే సెటిల్‌మెంట్ ఆప్షన్ అంటారు. ఒకవేళ పాలసీదారుడు సెటిల్‌మెంట్ ఆప్షన్ తీసుకోవాలనుకుంటే ఆ విషయాన్ని బీమా కంపెనీకి ముందుగా తెలియజేయాలి.

ప్రశ్న 5.2

సమూహ/సామూహిక బీమా పథకం లక్షణాలను వివరించండి

**బి2ఎల్. పిల్లల పథకాలు**

- పిల్లల చదువు, పెళ్లి వంటి ఆర్థిక అవసరాలను తీర్చుకునేందుకు పొదుపు చేయడంలో పిల్లల బీమా పథకాలు సాయం చేస్తాయి.
- పిల్లల బీమా పథకాలు బీమాతోపాటు పొదుపు ప్రయోజనాలను కూడా అందిస్తాయి.
- పిల్లలకు సొంతంగా ఎటువంటి ఆదాయం ఉండదనే విషయం గుర్తుంచుకోవడం ముఖ్యమైనది. పైగా పిల్లలు వారి ఆర్థిక అవసరాల కోసం పూర్తిగా తల్లిదండ్రులపైనే ఆధారపడతారు. అందువల్ల పిల్లల భవిష్యత్తు అవసరాల కోసం తల్లిదండ్రులు బీమా కంపెనీకి ప్రీమియం చెల్లిస్తూ సొమ్ము జమ చేస్తారు.
- పాలసీ గడువు తీరిన తర్వాత ఆ లబ్ధిని పొందేది చిన్నారులే.
- ఈ పథకాల్లో బీమా చేసిన పిల్లలపై రిస్క్ కవర్ ఒక వయసుకు ఎదిగిన తర్వాతే మొదలవుతుంది. ఇక్కడ పాలసీ ప్రారంభ తేదీకి మరియు రిస్క్ కవర్ మొదలయ్యే తేదీకి మధ్య ఉన్న తేడాను డిఫర్‌మెంట్ పీరియడ్ (వాయిదా కాలం)గా పిలుస్తారు.

- డిఫర్‌మెంట్ పీరియడ్ ముగింపు తర్వాత మొదలయ్యే రిస్క్ కవర్ తేదీని డిఫర్డ్ డేట్ అంటారు. డిఫర్డ్ డేట్‌ను పాలసీ వార్షికోత్సవంగా పరిగణిస్తారు.

- డిఫర్‌మెంట్ పీరియడ్ సమయంలో ఎటువంటి బీమా ఉండదు.

- పిల్లలు మేజర్లు అయ్యాక (18 ఏళ్లు నిండాక) పాలసీ టైటిల్ దానంతట అదే బీమా చేసిన వారి పేరిట మారుతుంది. ఈ ప్రక్రియను వెస్టింగ్ అంటారు. పిల్లల పేరిట పాలసీ టైటిల్ మారే తేదీని వెస్టింగ్ డేట్‌గా వ్యవహరిస్తారు.

- వెస్టింగ్ అనంతరం బీమా కంపెనీకి, బీమా పొందిన వ్యక్తికి (ఈ కేసులో పిల్లలు) మధ్య కాంట్రాక్టుగా మారుతుంది.

- కొన్ని రకాల పిల్లల పథకాల్లో 'వెయివర్ ఆఫ్ ప్రీమియం రైడర్' పాలసీతో పాటు  అందుబాటులో లభిస్తుండగా ఇతర పిల్లల పథకాల్లో తల్లిదండ్రులు ఈ ఆప్షన్ కోసం కొంత అదనపు ప్రీమియం చెల్లిచాల్సి ఉంటుంది. ఈ పథకంలో ఒకవేళ తల్లిదండ్రుల్లో  (ప్రీమియం చెల్లించే వారు) ఒకరు పాలసీ గడువులోగా మరణిస్తే ఆ పిల్లలు మేజర్లు అయ్యే వరకూ తల్లి లేదా తండ్రి తరఫున బీమా కంపెనీయే ప్రీమియాలు చెల్లిస్తుంది. పాలసీ గడువు ముగిశాక నియమనిబంధనల మేరకు పిల్లలు ఆ ప్రయోజనాన్ని పొందుతారు. రైడర్స్ గురించిన మరిన్ని వివరాలు చాప్టర్ 7లో చూద్దాం.

- పిల్లల బీమా పథకాలను ఎండోమెంట్ పథకాలు, మనీబ్యాక్ పథకాలు లేదా యులిప్‌ల విధానంలో తీసుకోవచ్చు.

**బీ2ఎం మనీబ్యాక్ పాలసీలు**

- మనీబ్యాక్ పాలసీలు పొదుపు మరియు బీమాలోని ద్వంద్వ ప్రయోజనాలను అందిస్తాయి. వీటి లక్షణాలు ఎండోమెంట్ పథకాలను పోలి ఉంటాయి.

- ఎండోమెంట్ పథకంలో పాలసీదారుడు పాలసీ గడువు ముగిశాక మెట్యూరిటీ సొమ్ము అందుకుంటాడు. అయితే మనీబ్యాక్ పాలసీల్లో పాలసీదారుడికి పాలసీ కాలంలో పాక్షిక సర్వైవల్ బెనిఫిట్స్ ను మధ్యమధ్యలో చెల్లిస్తారు.

- పాలసీదారుడు పాలసీ గడువులోగా నియమనిబంధనల మేరకు స్థిర శాతాల్లో లేదా చర శాతాల్లో ప్రయోజనాలు పొందుతాడు.

- పాలసీదారుడు అందుకునే మధ్యంతర ప్రయోజనాలపై ప్రస్తుతం అమల్లో ఉన్న పన్ను చట్టాల కింద ఎటువంటి పన్ను వడ్డన ఉండదు. ఒకవేళ పాలసీదారుడు పాలసీ గడువులోగా మరణిస్తే నామినీ లేదా లబ్ధిదారుడు బోనస్‌లతోపాటు ఎటువంటి మినహాయింపు లేకుండా పూర్తి బీమా సొమ్మును పొందుతారు.

**ఉదాహరణ**

ఏబీసీ బీమా కంపెనీ నుంచి చేతన్ మిశ్రా 20 ఏళ్ల కాలానికి రూ. 20,00,000 మనీబ్యాక్ పాలసీ తీసుకున్నాడు. బతికి ఉండగానే తన పొదుపు సొమ్ముపై ప్రయోజనాలు అందుకోవాలని అతను మనీబ్యాక్ పాలసీ తీసుకున్నాడు. అతను తన భార్య సుమేధాను పాలసీ లబ్ధిదారునిగా నామినేట్ చేశాడు. ఈ పాలసీ కింద అతను 25% సర్వైవల్ ప్రయోజనాన్ని వరుసగా 5,10, 15 ఏళ్లకు పొందనున్నాడు. మిగలిన 25% సర్వైవల్ బెనిఫిట్‌ను 20వ ఏడాది పొందనున్నాడు. అయితే, ఆ కుటుంబాన్ని విషాదం వెంటాడింది. చేతన్ ఒక కారు ప్రమాదంలో మరణించాడు. సుమేధా గృహిణి కావడంతో ఆర్థికంగా అతనిపై ఆధారపడి జీవించేది.

చేతన్ మరణం పాలసీ తీసుకున్న 11వ ఏడాది చోటుచేసుకుంది. అతను అప్పటికే సర్వైవల్ బెనిఫిట్ (రూ. 10,00,000)లో కొంత శాతాన్ని వరుసగా 5,10 ఏళ్లలో పొందాడు. ఈ కేసులో చేతన్ జీవించి ఉన్నప్పుడే 5,10 ఏళ్లలో రూ. 10,00,000 పొందినా అతను బీమా చేసిన మొత్తం రూ. 20,00,000 సొమ్మును సుమేధ పొందుతుంది.

**బి2ఎస్ వేతన పొదుపు పథకాలు (ఎస్ఎస్ఎస్)**

- వేతన పొదుపు పథకాలు (ఎస్ఎస్ఎస్) ఉద్యోగ వర్గాల అవసరాలను తీర్చేందుకు ఉద్దేశించినవి.
- ఈ పథకాల్లో పాలసీదారుడి ఉద్యోగ సంస్థతో బీమా కంపెనీ అవగాహన కుదుర్చుకుంటుంది. దీని ప్రకారం ఉద్యోగి జీతంలో నుండి ఆ సంస్థ ప్రీమియాన్ని వసూలు చేసి దాన్ని బీమా కంపెనీకి పంపుతుంది.
- నెల జీతంలో నుండి ప్రీమియం వసూలు అవుతుండటం వల్ల దాన్ని చెల్లించలేకపోవడమనే సమస్య ఉండదు.
- అలాగే ఈ పథకం క్రింద ఉద్యోగుల అందరి తరఫున ఉద్యోగ సంస్థ ద్వారా ఏకమొత్తంలో ప్రీమియం అందుకోవడంతో బీమా కంపెనీ కూడా లబ్ధి పొందుతుంది.

**దీన్ని పరిశీలించండి...**

దీని వల్ల బీమా కంపెనీకి ఏ ప్రయోజనం లభిస్తుందని మీరు భావిస్తున్నారు?

- ఉద్యోగి సంతకం చేసిన లేఖ ఆధారంగా అతని జీతంలోంచి ఉద్యోగ సంస్థ ప్రీమియం కోత పెడుతుంది. ఈ లేఖను ప్రపోజల్ ఫారంతో పాటు ఉద్యోగి బీమా సంస్థకు అందజేస్తాడు. బీమా సంస్థ పాలసీ జారీ చేసిన పిదప ఈ లేఖను ఉద్యోగ సంస్థకు పంపుతుంది.
- ఉద్యోగుల హోదాతో కూడిన జాబితా, వారు చెల్లించాల్సిన మొత్తంపై ఉద్యోగ సంస్థ నుంచి బీమా కంపెనీకు క్రమం తప్పకుండా అందుతుంది.
- వేతన పొదుపు పథకం (ఎస్ఎస్ఎస్) ప్రత్యేక బీమా పథకం కాదు. ఇది కేవలం ప్రీమియం వసూలు చేసుకునేందుకు ఏర్పాటు చేసుకున్న పద్ధతి మాత్రమే. ఈ పద్ధతిని టర్మ్ పథకం, ఎండోమెంట్ పథకం లేదా మరే ఇతర పథకానికైనా ఉపయోగించుకోవచ్చు.

**పన్నుల విధానం మరియు ద్రవ్యోల్బణం**

**సి1 బీమా సేవలపై పన్ను ప్రభావాలు**

ఆదాయపుపన్ను చట్టం 1961 కింద జీవిత బీమా ఉత్పత్తులు పన్ను ప్రయోజనాలకు అర్హత పొందాయి. బీమా పథకాలలో పెట్టుబడి పెట్టే సమయంతోపాటు వాటి గడువు తీరి మెచ్యూరిటీ చెల్లించే సమయంలో కూడా అవి పన్ను ప్రయోజనాలకు అర్హత పొందుతాయి.

(ఎ) పెట్టుబడి దశ: ఆదాయపుపన్ను చట్టంలోని సెక్షన్ 80 సీ కింద జీవిత బీమా పథకాల కోసం చెల్లించే ప్రీమియం, పన్ను చెల్లించాల్సిన ఆదాయం నుంచి తగ్గింపు పొందేందుకు అర్హత కలిగి ఉంటాయి. అయితే అందుకు ఈ క్రింద షరతు నెరవేరాల్సి ఉంటుంది:

ప్రస్తుత ఆదాయ పన్ను చట్టాల ప్రకారం బీమా పథకాలపై చెల్లించే ప్రీమియం బీమా మొత్తంలో 20% లేదా అంతకన్నా తక్కువగా ఉండాలి.

బీమా చేసిన మొత్తం ప్రీమియం చెల్లింపుకన్నా ఐదురెట్లు అధికంగా ఉండాలి.

**ఉదాహరణ**

ప్రశాంత్ రూ. 4 లక్షలకు యులిప్ పాలసీ తీసుకున్నాడు. అతను పన్ను ప్రయోజనాలు పొందేందుకు బీమా మొత్తం రూ. 4 లక్షల్లో ప్రీమియం 20%కన్నా తక్కువగా ఉండాలి. ఈ ఉదాహరణలో ప్రీమియం చెల్లింపు రూ. 80,000 లేదా

అంతకన్నా తక్కువ ఉండాలి. ఒకవేళ బీమా మొత్తం కన్నా ప్రీమియం 20%కు పైగా ఉంటే..అనగా ప్రీమియం చెల్లింపు రూ. 80,000కన్నా ఎక్కువగా ఉంటే ఆదాయపు పన్ను తగ్గింపు కేవలం 20%కు పరిమితమవుతుంది. ఈ ఉదాహరణలో ఇది రూ. 80,000కు పరిమితమవుతుంది.

ఇప్పుడు ఇదే ఉదాహరణను మరో కోణంలో పరిశీలిద్దాం:

ప్రశాంత్ తాను పన్ను చెల్లించాల్సిన ఆదాయం నుంచి తగ్గింపు పొందేందుకు రూ. 80,000 పెట్టుబడి పెడదామనుకున్నాడు. అందువల్ల అతను రూ. 80,000 ప్రీమియం చెల్లించి యులిప్ పాలసీ తీసుకోవాలనుకున్నాడు. ఒకవేళ అతను మొత్తం ప్రీమియంపై పన్ను తగ్గింపు పొందాలంటే బీమా మొత్తం ఈ ప్రీమియానికి కనీసం ఐదు రెట్లు అధికంగా ఉండేలా చూసుకోవాలి. అంటే ఈ ఉదాహరణలో ప్రశాంత్ కనీసం రూ. 4 లక్షలు లేదా అంతకన్నా ఎక్కువకు బీమా తీసుకోవాలి.

జాగ్రత్త సుమా

ప్రస్తుత ఆదాయపుపన్ను నిబంధనలను మార్పులకు అనుగుణంగా ఆదాయపుపన్ను శాఖ ఎప్పుడైనా సమీక్షించవచ్చు.

నూతన ప్రత్యక్ష పన్నుల కోడ్ (డీటీసీ) ముసాయిదాను ఆర్థిక మంత్రిత్వశాఖ రూపొందించింది. 2012 ఏప్రిల్ 1 నుంచి దీన్ని అమలు చేయనుంది. దీని ఫలితంగా ప్రస్తుత ఆదాయపుపన్ను చట్టాల్లో అప్పుడు మార్పులు చోటుచేసుకుంటాయి. సెక్షన్ 80సి క్రింద ఒక ఆర్థిక సంవత్సరంలో ప్రీమియంపై గరిష్ట పన్ను తగ్గింపు ప్రయోజనం రూ. 1,00,000 ఉంది.

(బి) మెచ్యూరిటీ దశ: ప్రస్తుత ఆదాయపుపన్ను చట్టంలోని సెక్షన్ 10 (10డి) క్రింద బీమా చేసిన వ్యక్తి గడువు తీరాక పొందే ప్రయోజనంపై లేదా బీమా చేసిన వ్యక్తి మరణం వల్ల నామినీ/లబ్ధిదారుడు అందుకునే మొత్తంపై ఎటువంటి పన్ను లేదు. అయితే బీమా చేసిన మొత్తంపై చెల్లించే ప్రీమియం 20%కు మించరాదన్న నిబంధన ఇక్కడ కూడా వర్తిస్తుంది.

చేయాల్సిన పని

ఆదాయపుపన్ను చట్టంలోని సెక్షన్ 80 సి క్రింద ఒక వ్యక్తి రూ. 1,00,000 వరకూ ఆదాయపు పన్ను ప్రయోజనాలు పొందవచ్చు. జీవిత బీమా అనేది పెట్టుబడి మార్గాల్లో ఒకటి. ఇతర పెట్టుబడుల మార్గాలను గుర్తించి వాటి జాబితా రూపొందించండి.

**సి2 ద్రవ్యోల్బణం**

బీమా మొత్తంపై దీర్ఘకాలంలో ద్రవ్యోల్బణం ప్రభావం తీవ్రంగా ఉండవచ్చు. మామూలు పదాల్లో చెప్పాలంటే, ద్రవ్యోల్బణం అంటే దేశంలోని వస్తుసేవల ధరల్లో పెరుగుదల. అంటే ఇది జీవన వ్యయంలో పెరుగుదలను సూచిస్తుంది.

**ఉదాహరణ**

కొన్నేళ్ల కిందటి వరకూ లీటరు పెట్రోల్ ధర రూ. 40గా ఉండేది. ప్రస్తుతం అదే లీటరు పెట్రోల్ రూ.60కి పెరిగింది. అంటే ధరలో 50% పెరుగుదల నమోదైంది. కొన్నేళ్ల కిందటి వరకూ రూ. 100లకు 2.5 లీటర్ల పెట్రోల్ లభించేది. ప్రస్తుతం అదే రూ. 100లకు 1.67 లీటరు పెట్రోల్ మాత్రమే లభిస్తోంది. అంటే కొన్నేళ్ల వరకూ రూ. 100లకు లభించే సామాగ్రిలో ప్రస్తుతం కొంత మాత్రమే కొనేందుకు సాధ్యమవుతోంది. ఒకవేళ భవిష్యత్తులో కూడా ధరలు పెరిగితే అదే రూ. 100లకు ఇంకా తక్కువ సామాగ్రి మాత్రమే కొనగలుగుతాం.

ద్రవ్యోల్బణం ప్రభావం ఆ రీతిలో ఉంటుంది: ధనం దాని విలువను కోల్పోతోంది.

బీమాపై కూడా ద్రవ్యోల్బణం ఇటువంటి ప్రభావమే చూపుతుంది. ఈరోజు మన బీమా అవసరాల దృష్ట్యా 30 ఏళ్ల కాలానికి రూ. 50 లక్షల బీమా పాలసీ తీసుకున్నారనుకోండి. అదే బీమా పాలసీ విలువ 15-20 ఏళ్ల తర్వాత ద్రవ్యోల్బణం ప్రభావం వల్ల తక్కువగా ఉంటుంది. అలాగే ద్రవ్యోల్బణం పెరిగేకొద్దీ బీమా అవసరాలు కూడా పెరుగుతాయి. అందువల్ల క్లయింట్లు (మరియు ఇతర బీమా ఏజెంట్లు) ద్రవ్యోల్బణం ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకొని వారి బీమాను కాలానుగుణంగా సమీక్షించుకోవాలి.

బీమా కంపెనీలు అందించే కొన్ని రకాల బీమా పథకాలు పాలసీదారుడు క్రమ వేళల్లో పాలసీ మొత్తాన్ని పెంచుకునే/తగ్గించుకునే వెసులుబాటు కల్పిస్తున్నాయి.

**ఉదాహరణ**

కొన్ని కంపెనీలు బీమా మొత్తాన్ని ఏటా 5 నుంచి 10 శాతం పెంచుకునేందుకు లేదా తగ్గించుకునేందుకు అవకాశం కల్పిస్తున్నాయి. ఏటా ఇటువంటి బీమాను పెంచుకోవడం వల్ల ద్రవ్యోల్బణం బారి నుంచి పాలసీదారుడు తనను తాను కాపాడుకోవచ్చు.

**డి. భద్రత అవసరాలలో ప్రాధాన్యతలు**

**డి1. అవసరాలను ప్రాధ్యానత క్రమంలో ఏర్పాటు చేసుకోవడం ఎందుకు?**

జీవితంలో ఒక వ్యక్తికి చాలా భద్రత అవసరాలు ఉంటాయి. ప్రశాంత్ ఉదాహరణను తీసుకొని అతని భద్రత అవసరాలను గుర్తించండి:

Figure 5.2

వైద్య/ఆరోగ్య సమస్యలకు వ్యక్తిగత మరియు కుటుంబ భద్రత

నిషాంత్ పెళ్లికి ప్రణాళిక

నిషాంత్ ఉన్నత చదువుకు ప్రణాళిక

గృహరుణం, కారు రుణంపై భదత్ర

పదవీవిరమణపై భద్రత

భవిష్యత్తు ఆదాయంపై భదత్ర

ఈ అవసరాలను తీర్చేందుకు ప్రశాంత్ వద్ద తగినంత ఆర్థికబలం ఉందా? ఒకవేళ లేకపోతే, అతను వీటిలో ఏది తనకు అత్యంత ప్రధానమైనదని ఎలా నిర్ణయించుకుంటాడు?

మెరుగైన ఆర్థిక వనరులు ఉన్న వ్యక్తి తన అన్ని భద్రత అవసరాలకు డబ్బు ఏర్పాటు చేసుకోగలడు. అయితే పరిమిత ఆర్థిక వనరులు ఉన్న వ్యక్తి తన అన్ని భద్రత అవసరాలను ఒకే సమయంలో తీర్చుకోలేడు.

ఈ సమయంలోనే అవసరాలను ప్రాధాన్యత క్రమంలో ఎంపిక చేసుకోవడం అనే అంశం తెరపైకి వస్తుంది.

**డి2 అవసరాలను ఎలా ప్రాధాన్య క్రమంలో నిర్ణయించుకోవాలి**

ప్రశాంత్‌కు తన భద్రత అవసరాలను తీర్చుకునే ఆర్థిక వనరులు లేవని భావించండి. అయితే ఈ సమస్య నుంచి అతను బయట పడేందుకు బీమా ఏజెంట్ ఏ విధంగా సాయం చేయగలడో చూద్దాం. ఈ విషయంలో మనం ఒక్కో అంశాన్ని పరిశీలిద్దాం.

| | |
|---|---|
| భవిష్యత్తు ఆదాయానికి భద్రత: | ప్రశాంత్ ఆదాయం నుంచే అన్ని అవసరాలకు ఆర్థిక వనరులను ఏర్పాటు చేసుకోవాల్సి ఉండటంతో ఈ అవసరం ఎంతో కీలకమైనది. అందువల్ల ప్రశాంత్ ఈ అవసరాన్ని ప్రాధాన్యత క్రమంలో ఉంచుకొని దానికి భద్రత కల్పించుకోవాలి. అతను ఒక టర్మ్ బీమా పథకంతో భద్రత కల్పించుకోవడంతో మొదలుపెట్టి భవిష్యత్తులో ఆదాయవనరులు పెరిగాక పొదుపు/పెట్టుబడి పథకాలను ఎంపిక చేసుకోవచ్చు. అతనికి ఉన్న ఇతర అవకాశం ఏమిటంటే  మార్పిడి టర్మ్ పథకాన్ని తీసుకొని కొంతకాలం తర్వాత దాన్ని ఎండోమెంట్ పథకం లేదా పూర్తి జీవిత పథకంగా మార్చుకోవడం. |
| వైద్య/ఆరోగ్య సమస్యలకు వ్యక్తిగత మరియు కుటుంబ భద్రత: | అత్యవసర వైద్య సమస్యలు ఎప్పుడైనా ఎదురయ్యే అవకాశం ఉండటం వల్ల ఈ అవసరానికి కూడా ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉంది. ప్రశాంత్ ఇందుకోసం కుటుంబ ఆరోగ్య బీమా పథకం తీసుకుంటే సరిపోతుంది. సాధారణంగా కంపెనీ యాజమాన్యాలు ఉద్యోగులకు, వారి కుటుంబాలకు కలిపి ఆరోగ్య బీమా తీసుకుంటాయి. ఇలాంటప్పుడు మన దగ్గర ఆర్థిక వనరులు పరిమితంగా ఉంటే ఆరోగ్య బీమాను వాయిదా వేసుకోవచ్చు. |
| నిషాంత్ చదువుకు ప్రణాళిక: | పెళ్లి చేసుకొని పిల్లలున్న వ్యక్తులకు ఈ అవసరం కూడా ప్రధానమైనది. ఈ కేసులో ప్రశాంత్ చిన్న మొత్తాల్లో పెట్టుబడి పెడుతూ పిల్లల బీమా పథకం తీసుకోవచ్చు. భవిష్యత్తులో ఆర్థిక వనరులు సమకూర్చుకున్నాక ఈ లక్ష్యం కోసం పెట్టుబడులను అతను పెంచుకోవచ్చు. |
| నిషాంత్ పెళ్లికి ప్రణాళిక: | సరైన ఆర్థిక వనరులు లేనప్పుడు ఈ అవసరాన్ని వాయిదా వేసుకోవచ్చు. మెరుగైన ఆర్థిక వనరులు ఉన్న వ్యక్తులు ఈ అవసరం కోసం కూడా బీమాలో పెట్టుబడి పెట్టవచ్చు. |
| గృహరుణం, కారు రుణంపై | ఈ అవసరానికి భద్రత కల్పించుకోవడం అత్యంత అవసరం. కుటుంబంలో సంపాదించే |

| | |
|---|---|
| భద్రత: | వ్యక్తికి ఏదైనా దుర్ఘటన జరిగితే ఆ కుటుంబం ఈఎంఐలు చెల్లించలేకపోతే రుణదాతలు ఆ ఆస్తులను స్వాధీనం చేసుకొని విక్రయించే ప్రమాదం ఉంది. గృహరుణానికి భద్రత కోసం బీమా చేసే వ్యక్తి బ్యాంకు నుంచి గృహరుణ భద్రత బీమాను పొందవచ్చు. అలాగే కారు రుణం కోసం టర్మ్ బీమా పథకాన్ని కూడా తీసికొనవచ్చును. |
| పదవీవిరమణకు ప్రణాళిక: | ఇది కూడా ఎంతో ప్రధానమైన అవసరం. అయితే సరైన ఆర్థిక వనరులు లేని వ్యక్తి భవిష్యత్తులో ఆర్థిక వనరులు పెరిగాక ఈ అవసరం తీర్చుకునేందుకు చిన్న మొత్తాల్లో పెట్టుబడి పెట్టుకోవచ్చు. పెన్షన్ల గురించి మనం వచ్చే రెండు చాప్టర్లలో వివరంగా తెలుసుకుందాం. |

**భద్రత అవసరాలపై దూరదృష్టితో వ్యవహరించడం ఎలా అనగా:**

అవసరాలను ప్రాధాన్య క్రమంలో గుర్తించి వెంటనే అత్యవసరమైన వాటికి భద్రత కల్పించుకోవాలి. ఓ మాదిరి అవసరాలకు చిన్న మొత్తాల్లో పెట్టుబడులు పెడుతూ భవిష్యత్తులో పెట్టుబడులను పెంచుకుంటూ వెళ్లాలి.

↓

తక్కువ ప్రాధాన్యత గల అవసరాలను వాయిదా వేసి భవిష్యత్తులో అదనపు ఆర్థిక వనరులు లభించాక వాటి కొరకు భద్రత కల్పించుకోవాలి.

చేయాల్సిన పని

↓

మీ భద్రత అవసరాల జాబితా తయారు చేసుకోండి. ఆ అవసరాలను అత్యవసరం, బాగా అవసరం, ఓ మాదిరి అవసరం, తక్కువ అవసరం వంటి విభాగాలుగా ప్రాధాన్య క్రమంలో గుర్తించాలి. ఇప్పుడు ప్రశాంత్ జీవితం అనుకోని మలుపు ఎలా తిరిగిందో తెలుసుకోవడంతోపాటు అతను తన కుటుంబ అవసరాల కోసం ప్రాధాన్యత క్రమంలో సరైన బీమా భద్రత ఎలా తీసుకోవాల్సిందో చూద్దాం.

**ఉదాహరణ: ప్రశాంత్ జీవితం తిరిగి గాడిలో పడింది**

ఉదాహరణలోని మొదటి భాగం భారతదేశం వెలిగిపోవడాన్ని చూపితే రెండో భాగం కఠిన వాస్తవాలను చూపుతుంది. జీవితం ఎంత అనిశ్చితమైనదో తెలపడంతోపాటు జీవిత బీమా పొందకపోతే కుటుంబం ఎలాంటి ఫలితాలు అనుభవిస్తుందో తెలియజేస్తుంది.

ప్రశాంత్ తన ప్రణాళిక వేసుకోవడంలో ఎక్కడ తప్పు చేశాడో ఇప్పుడు మనం విశ్లేషిద్దాం. అలాగే అతని అవసరాలను బీమా ఎలా తీర్చగలిగేదో చూద్దాం.

టర్మ్ బీమా: కుటుంబంలో సంపాదించేది ప్రశాంత్ ఒక్కడే. అందువల్ల అతను భవిష్యత్తులో తాను సంపాదించే ఆదాయంపై భద్రత ఉండేలా చూసుకోవాల్సింది. ఒక్క మాటలో చెప్పాలంటే, ప్రశాంత్ జీవించి ఉన్నా లేకున్నా అతని కుటుంబం కష్టాలు పడకూడదు. కుటుంబం నుంచి దూరమయ్యే వ్యక్తి వల్ల ఏర్పడిన లోటును బీమా పూడ్చలేకపోవచ్చు. కానీ కనీసం ఆర్థిక లోటును అయినా తీర్చగలదు. అందువల్ల ప్రశాంత్ తాను రిటైరయ్యే సమయానికి సంపాదించే జీతాన్ని పరిగణనలోకి తీసుకొని టర్మ్ బీమా పథకాన్ని తీసుకొని ఉండాల్సింది. అందుకు భిన్నంగా ప్రశాంత్ ఎండోమెంట్ పథకం తీసుకున్నాడు. అది కూడా భద్రత కోసం కాకుండా కేవలం ఆదాయపుపన్ను ప్రయోజనాల కోసమే దీన్ని తీసుకున్నాడు. ప్రశాంత్ ఒకవేళ టర్మ్ బీమా పథకం తీసుకొని ఉంటే అదే రూ. 20,000 ప్రీమియమునకు అతనికి మరింత భారీ బీమా మొత్తం లభించేది. దీంతో అతను లేకపోయినా అతని కుటుంబం గృహరుణం, కారు రుణం మరియు ఇతర అవసరాలను తీర్చుకోగలిగేది.

పిల్లల బీమా: ప్రశాంత్‌కు స్వీయ భద్రత బీమానే లేదు. అదే సమయంలో అతను తన కొడుకు నిషాంత్ చదువు కోసం మ్యూచువల్ ఫండ్‌లో పెట్టుబడి పెట్టాడు. ప్రశాంత్ మరణించిన వెంటనే పెట్టుబడులు ఆగిపోవడంతోపాటు నిషాంత్ ఉన్నత చదువు యొక్క కలలు కూడా అర్ధాంతరంగా ఆగిపోయాయి. నిషాంత్ చదువు కోసం ప్రశాంత్ పిల్లల బీమా పథకం తీసుకొని ఉండాల్సింది. ఈ పథకం ఉండి ఉంటే ప్రశాంత్ మరణించినా అతని కొడుకు ఉన్నత విద్య లక్ష్యాలకు బీమా కంపెనీ ప్రీమియములు చెల్లించేది. దీనివల్ల నిషాంత్ చదువుపై రాజీపడాల్సిన అవసరం వచ్చేది కాదు.

గృహరుణం మరియు కారు రుణం: ప్రశాంత్ బాధ్యతలు పెరిగాక అతను తన అదనపు బాధ్యతల భద్రత కోసం టర్మ్ బీమా పథకాన్ని మరింత పెంచవలసినది. ఈ పరిస్థితిలో బీమా ఉండి ఉంటే ప్రశాంత్ లేకపోయినా బీమా సొమ్ము గృహరుణం, కారు రుణం చెల్లించేందుకు దోహదపడేది. ఇది జరిగి ఉంటే ప్రశాంత్ కుటుంబం కారును అట్టిపెట్టుకొని అదే ఇంట్లో నివసించేందుకు మార్గం సుగమమయ్యేది.

పదవీవిరమణ ప్రణాళికలు: ఎండోమెంట్ పథకానికి బదులు ప్రశాంత్ విస్తృతమైన టర్మ్ పథకాన్ని తీసుకొని ఉండాల్సింది. దీనివల్ల మిగిలిన మొత్తం అతను పదవీవిరమణ బీమా పథకానికి మళ్లించుకునేందుకు దోహదపడేది.

**సంక్షిప్తంగా**

సరైన ప్రణాళికలతో సరైన జీవిత బీమా సేవలు పొంది ఉంటే కుటుంబంలో ఒకవేళ సంపాదించే వ్యక్తి మరణించినా ఆ కుటుంబానికి ఎలా ఆర్థిక భద్రతలభిస్తుందో ఈ చాప్టర్‌లో మనం చూశాం.

ఓ వృత్తిపరమైన జీవిత బీమా ఏజెంట్‌గా మీరు:

- జీవిత బీమా ఉత్పత్తుల సేవల లక్షణాలు, వాటి విస్తృతి గురించి తెలుసుకోవాలి.
- ఓ వ్యక్తి భద్రత అవసరాలను విశ్లేషించగలగాలి.
- వ్యక్తుల అవసరాలను తీర్చేందుకు జీవిత బీమా ఉత్పత్తులను ఎంత ఉత్తమంగా ఉపయోగించుకోవచ్చో గుర్తించగలగాలి.

**కీలక పదాలు**

ఈ పాఠంలో నేర్చుకున్న ప్రధాన అంశాలు స్థూలంగా:

భద్రత అవసరాలు

ఒక వ్యక్తికి అవసరమైన వివిధ భద్రత అవసరాలు ఏమనగా: ఆదాయ భద్రత, వైద్య ఖర్చుల అవసరాలు, పిల్లల చదువు, పిల్లల పెళ్లి, వివిధ ఆస్తులపై రుణాలు, కుటుంబ జీవనము, భద్రత అవసరాలపై ప్రభావం చూపే అంశాలు: వయసు, ఆధారపడిన వ్యక్తులు, ఆదాయం, ఆస్తులు మరియు అప్పులు

బీమా ఉత్పత్తులు

జీవిత బీమా ఉత్పత్తులలోని రెండు మౌలిక అంశాలు ఏమిటంటే: డెత్ కవర్ (మరణించిన తర్వాత లభించే ప్రయోజనాలు), మరియు మెచ్యూరిటీ బెనిఫిట్స్ (గడువు తీరాక అందే బీమా సొమ్ము)టర్మ్ బీమా పథకం కేవలం బీమా చేసిన వ్యక్తి పాలసీ కాలవ్యవధిలో మరణిస్తేనే వర్తిస్తుంది.

పూర్తి ఎండోమెంట్ పథకంలో బీమా చేసిన వ్యక్తి నిర్ణీత కాలవ్యవధి వరకూ జీవించి ఉంటే అతనికి గడువు తీరిన తర్వాత లభించే ప్రయోజనాలు అందుతాయి.

ఎండోమెంట్ బీమా పథకం అనేది టర్మ్ పథకం మరియు పూర్తి ఎండోమెంట్ పథకంలోని లక్షణాల కలబోత.

బీమా చేసిన వ్యక్తి ఒకవేళ మరణిస్తే నామినీకి బీమా ప్రయోజనాలు అందుతాయి. అలాగే బీమా చేసిన వ్యక్తి ఆ కాలవ్యవధి పూర్తయ్యే వరకూ జీవించి ఉంటే గడువు తీరిన తర్వాత వచ్చే ప్రయోజనాలు అందుతాయి.

ఎండోమెంట్ బీమా పథకంలో పొదుపు అంశం కూడా ఉంది. పెట్టుబడులపై వచ్చే లాభాలపై బీమా కంపెనీలు బోనస్‌లు కూడా చెల్లిస్తాయి.

పూర్తి జీవిత కాలపు బీమా అనేది వ్యక్తిగతంగా ఒక వ్యక్తి జీవిత కాలానికి ఉపయోగపడుతుంది.

మార్పిడి బీమా పథకంలో ఒక బీమా పథకం నుంచి మరో పథకానికి మారవచ్చు.

ఉమ్మడి జీవిత బీమా పథకంలో ఒక పాలసీ కింద ఇద్దరు వ్యక్తులకు బీమా వర్తిస్తుంది.

ఒక వ్యక్తి బీమా కంపెనీకి ఏకమొత్తంలో చెల్లించే సొమ్మును ఆ కంపెనీ తిరిగి దశలవారీగా చెల్లించడాన్ని యాన్యుటీ అంటారు.

ఒక బృందంగా పనిచేస్తున్న వారందరికీ సామూహిక/సమూహ బీమా పథకం ద్వారా భద్రతను కల్పించవచ్చు

తక్కువ ఆదాయం ఉన్న వారికి సూక్ష్మ బీమా పథకం ద్వారా భద్రత కల్పించవచ్చు.

యూనిట్ ఆధారిత బీమా పథకం (యులిప్‌ల) వల్ల మూలధనాన్ని పెంపొందించుకోవచ్చు.

యులిప్ పథకాల్లో బీమా చేసిన వారికి నష్టభయం ఎక్కువగా ఉంటుంది. సంప్రదాయ పథకాల్లోలాగా బీమా కంపెనీలపై నష్టభారం ఉండదు.

పిల్లల భవిష్యత్తు అవసరాల కోసం పిల్లల బీమా పథకం ఉపయోగపడుతుంది. విద్య, పెళ్లి వంటి వాటికి ఇది దోహదపడుతుంది.

మనీబ్యాక్ పథకంలో కొద్దిపాటి మాత్రమే లాభాలు ఉంటాయి. కొన్ని ప్రత్యేక సమయాల్లో ఇవి పాలసీదారుడికి అందించబడతాయి.

వేతన పొదుపు పథకం అనేది ప్రత్యేకమైన బీమా పథకం కాదు. అయితే ప్రీమియం చెల్లించేందుకు అనువుగా ఉంటుంది. ఈ పథకంలో ఉద్యోగస్తుని నెలవారీ జీతం నుంచి ప్రీమియం సొమ్మును చెల్లించే విధంగా బీమా కంపెనీలు ఉద్యోగస్తుడి యాజమాన్యంతో ప్రత్యేక ఏర్పాట్లు చేసుకుంటాయి. దీనివల్ల ఉద్యోగస్తులు చెల్లించే ప్రీమియం నేరుగా బీమా కంపెనీకి వెళుతుంది.

పన్నుల విధానం మరియు ద్రవ్యోల్బణం

ఆదాయపుపన్ను చట్టంలోని నిబంధన 80సీ ప్రకారం ఒక ఆర్థిక సంవత్సరంలో బీమా పథకాల కోసం చెల్లించే ప్రీమియం వల్ల రూ. లక్ష వరకూ పన్ను మినహాయింపు పొందవచ్చు.

ఆదాయపు పన్ను ప్రయోజనాలు పొందేందుకు బీమా చేసిన మొత్తంలో ప్రీమియం 20 శాతంనకు మించకూడదు. లేదా ప్రీమియంపై ఐదు రెట్లు బీమా మొత్తం ఉండాలి.

ఆదాయపు పన్ను చట్టంలోని నిబంధన 10 (10డీ) ప్రకారం గడువు ముగిసిన తర్వాత లేదా మరణానంతరం బీమా కంపెనీలు ఇచ్చే సొమ్ముకు పన్ను ఉండదు.

ద్రవ్యోల్బణం ప్రభావం వల్ల బీమా మొత్తం విలువ దీర్ఘకాలంలో తగ్గుతుంది.

ద్రవ్యోల్బణానికి అనుగుణంగా కొన్ని బీమా కంపెనీలు బీమా మొత్తాన్ని పెంచుకొనే ప్రయోజనాన్ని కల్పిస్తాయి.

కొన్ని బీమా కంపెనీలు బీమా మొత్తాన్ని తగ్గించుకునే అవకాశం కల్పిస్తాయి. దీనివల్ల రుణాలపై ప్రయోజనం లభిస్తుంది.

ముఖ్యమైన భద్రతా అవసరాలు

ఒక వ్యక్తికి ముఖ్యమైన భద్రత అవసరాలు చాలా అవసరం. తక్కువ ఆదాయం ఉన్న వారు ఒకేసారి అన్ని రకాల భద్రతా అవసరాలను పొందలేరు. కనుక ఇది అత్యంత ప్రధానమైనది.

వ్యక్తులు వారి అవసరాలను ఇలా విభజించుకోవాలి: క్లిష్టమైనవి, అతిముఖ్యమైనవి, సాధారణమైనవి, చాలా తక్కువ సాధారణమైనవి. మనకు లభించే ఆదాయాన్ని బట్టి పైవాటిని విభజించాలి.

ప్రశ్నలు జవాబులు

5.1 జీవిత బీమా పథకాల్లో ప్రాథమికంగా రెండు అంశాలు అవి ఏమనగా:

మరణానంతరం వచ్చే ప్రయోజనాలు (డెత్ కవర్): బీమా చేసిన వారు పాలసీ కాలవ్యవధిలో మరణిస్తే బీమా సొమ్మును నామినీకి చెల్లిస్తారు.

బీమా పాలసీ తీసుకున్న వ్యక్తి పాలసీ గడువు పూర్తయ్యే వరకూ జీవించి ఉంటే బీమా కంపెనీ నుంచి పొందే సొమ్మును మెట్యూరిటీ బెనిఫిట్ అంటారు.

5.2 సమూహ/సామూహిక బీమా పథకంలో ఉన్న ప్రయోజనాలు ఏమిటంటే:

ఒక బృందంలో పనిచేస్తున్న వారందరికీ సమూహ/సామూహిక బీమా పథకం ద్వారా బీమా భద్రతను కల్పించవచ్చు.

బృందంలో ఉండే వ్యక్తులు సాధారణంగా

ఒక సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులు

బ్యాంకు ఖాతాదారులు

కార్మిక సంఘంలోని సభ్యులు

అకౌంటెంట్ల సంఘం వంటి వృత్తిపరమైన సభ్యులు

ఒక లక్ష్యం కోసం పనిచేస్తున్న వారు లేదా ఒక ఉద్దేశం కోసం పనిచేస్తున్న బృందంలోని వ్యక్తులు

సమూహ/సామూహిక బీమా పథకంలో బీమా కంపెనీ బృందంలోని సభ్యులందరికీ వర్తించే విధంగా మాస్టర్ పథకాన్ని అందిస్తుంది. ఉదాహరణకు ఒక కంపెనీలో పనిచేస్తున్న వారందరికీ బీమా సౌకర్యాన్ని కల్పిస్తూ మాస్టర్ పథకాన్ని ఇస్తుంది. అప్పుడు కంపెనీ యాజమాన్యాన్ని మాస్టర్ పాలసీదారుడిగా గుర్తిస్తారు.

స్వీయ ప్రశ్నలు

ఓ వ్యక్తికి ఉండే వివిధ భద్రత అవసరాల జాబితా తయారు చేయండి

మార్పిడి పథకాలు అంటే ఏమిటి? వాటి ప్రాధాన్యత ఏమిటి?

స్వీయ జవాబులు

1. ఓ వ్యక్తికి ఉండే వివిధ భద్రత అవసరాలు ఏమిటంటే:

ఆదాయ భద్రత

వైద్య ఖర్చుల అవసరాలు

పిల్లల చదువు

పిల్లల పెళ్లి

వివిధ ఆస్తులపై రుణాలు

కుటుంబ నిర్వహణ

2. మార్పిడి పథకం అనేది ఒక బీమా పథకం నుంచి మరొక పథకానికి మార్చుకునే వీలు ఉంటుంది. ఉదాహరణకు కాలవ్యవధి బీమా పథకాన్ని ఎండోమెంట్ పథకంలోకి మార్చుకోవచ్చు. జీవిత కాలపు బీమా పథకం లేదా ఇతర పథకాలకు మార్చుకునే వీలును బీమా కంపెనీలు కల్పిస్తాయి.

మొదట్లో ఎక్కువ మొత్తంలో ప్రీమియం చెల్లించలేని వారికి మార్పిడి పథకం బాగా ఉపయోగపడుతుంది. తక్కువ ప్రీమియంతో టర్మ్  బీమా పథకాన్ని ప్రారంభించి తర్వాత ఎక్కువ ప్రీమియంతో ఎండోమెంట్ పథకం లేదా మొత్తం జీవిత బీమా పథకంలోకి మారవచ్చు. ఒక పథకం నుంచి మరొక పథకంలోకి మారేటప్పుడు వైద్య పరీక్షలు కూడా చేయించుకోవాల్సిన అవసరంలేదు. అలాగే మరింత అండర్‌రైటింగ్ కూడా అవసరంలేదు.